

లోపలి పేజీల్లో..

ఏసీబీ వలలో పిఠాపురం రూరల్ ఎస్ఐ
- రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఎస్ఐ గుణశేఖర్, ప్రైవేటు డ్రైవర్ శివ



మామూళ్ల.. మత్తు మందు!

డ్రగ్స్ అధికారుల ఎడిక్ట్!

- మామూళ్ల మత్తులో అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 3,500 షాపులు
- ఏడాదికి రూ.6 కోట్లు వసూళ్లు?
- ప్రతి దానికి ఒక రేటు నిర్ణయం
- తూతూ మంత్రంగా తనిఖీలు
- 'ఆపరేషన్ గరుడ' అంతంతే
- కన్నెత్తి చూడని డ్రగ్స్ యంత్రాంగం
- ఇష్టానుసారం వ్యాపారుల దోపిడీ
- మోసపోతున్న వినియోగదారులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఔషధ నియంత్రాధికారులు నిద్దరోతున్నారు.. చుట్టూ దోపిడీ జరుగుతున్నా ఏం తెలియనట్టే వ్యవహరిస్తున్నారు.కళ్లెదుట దోపిడీ సాగుతున్నా కళ్లప్పగించి చూస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతూ మనకెందుకొచ్చిందని వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి సుమారు రూ.5 కోట్లు పైనే మామూళ్ల వసూళ్లు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ గరుడలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హడావుడిగా చేసిన తనిఖీలే అందుకు ఉదాహరణ.. 16 షాపుల్లో తనిఖీలు చేసి కేవలం 11 చిన్న కేసులే నమోదు చేశారు. ఉన్నతాధికారులకు తూతూ మంత్రపు నివేదిక పంపి చేతులు దులుపుకున్నారు.

మందుల ధరల బాదుడే..

ప్రస్తుతం మనిషికి ఔషధం అనేది నిత్యావసరం. ప్రతి ఇంటిలోనూ నెలకు వచ్చిన ఆదాయంలో సుమారు పది నుంచి 50 శాతం మందులకు ఖర్చు చేస్తున్నారంటే ఏమేరకు అవసరాలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అయినా దోపిడీ మాత్రం ఆగడం లేదు. నిత్యావసర మందుల ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అయినా అడిగేవాడులేడు. పట్టించుకునేవారు అసలే లేరు.. మందులు ఎంత అంటే అంత పెట్టి కొనాల్సిందే. మెడికల్ షాపుల్లో నకిలీ మందులు ఇబ్బడి ముబ్బడిగా ఉంటున్నా ఇటీవల చేసిన తనిఖీల్లో ఒక్కటీ పట్టుకోలేకపోవడం కొసమెరుపు. మరోవైపు మందుల ధరలు ఇష్టానుసారం పెంచేస్తున్నా అడిగే నాథుడు లేడు. బీపీకి వాడే ఇస్పిన్ 10 ట్యాబ్లెట్ల స్ట్రిప్ కరోనాకు ముందు రూ.28 వరకూ ఉండేది. ప్రస్తుతం రూ.82 తీసుకుంటున్నారు. ఇలా అనేక రకాల మందుల ధరలు పెంచేసి విక్రయిస్తున్నారు. జనరిక్ మెడికల్ షాపుల్లోనూ అధిక ధరలకు అమ్మేస్తున్నా కనీస తనిఖీలు కానరావడం లేదు. మరోవైపు ఆన్‌లైన్‌లోనూ మందులు అమ్మేస్తున్నారు. ఇంకోవైపు మత్తు టాబ్లెట్ల వాడకం పెరిగినట్టు సమాచారం. మొన్న శనివారం చేసిన తనిఖీల్లో భాగంగా రాజమహేంద్రవరంలోని తిరుమల శ్రీనివాస మెడికల్ ఏజెన్సీలో ట్రమడాల్ ఇంజక్షన్లు ఉండాల్సిన స్టాకుకంటే తక్కువగా ఉండడమే ఉదాహరణ. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు.

16 షాపులు.. 11 కేసులు

మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారనే కారణంతో ప్రభుత్వం శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 'ఆపరేషన్ గరుడ' పేరుతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డ్రగ్స్, ఈగల్, పోలీసు తదితర అధికారుల బృందాలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 16 షాపులపై దాడులు చేశారు. ఈ 16 షాపుల జాబితా ముందే సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పుగోదావరి జిల్లాలో 8, కాకినాడ జిల్లాలో 4, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4 దుకాణాలపై దాడులు చేశారు. తనిఖీల్లో పెద్ద కేసు లేమీ పెట్టలేదు. స్టాక్ రికార్డుకు.. స్టాక్‌కు మధ్య తేడా



రాజమండ్రిలో తనిఖీలు చేసిన విజిలెన్స్ ఎస్పీ స్నేహిత (ఫైల్)

ఉన్నట్టు 11 చోట్ల నమోదు చేశారు. ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్నారనే కారణంతో నాలుగు కేసులు నమోదు చేశారు. అనుమానం వల్ల మూడుచోట్ల శాంపిల్స్ తీసుకున్నారు. రెండుచోట్ల ట్రమడాల్ ట్యాబ్‌లెట్లు ఎవరికి విక్రయించారనే దానిపై ఆరా తీశారంతే. కానీ వీటి వివరాలేమీ అధికారికంగా డ్రగ్స్ ఏడీ ఆఫీసు చెప్పకపోవడం గమనార్హం. విజిలెన్స్ అధికారులు మాత్రం వివరాలిచ్చారు. మందుల షాపుల్లో జరుగుతున్న దందా ఏమైందో మరి.

అధికారులేం చేయాలి..

ఉమ్మడి తూర్పుగోదావరి, కొవ్వూరు డివిజన్ పరిధి కలిపి రాజమహేంద్రవరంలోనే డ్రగ్స్ ఏడీ కార్యాలయం ఉంది. దీని పరిధిలో మెడికల్ షాపులు, ఏజెన్సీలు సుమారు 3,500 వరకూ ఉన్నాయి. అవి కాకుండా ఆసుపత్రుల్లో కూడా మెడికల్ షాపులు ఉన్నాయి. బ్లడ్‌బ్యాంక్‌లు చాలా ఉన్నాయి. జిల్లా ఔషధ నియంత్రాధికారి కార్యాలయంలో ఏడీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఉంటారు. ఎవరు ఏ మందులు అమ్ముతున్నారు. నిబంధనల ప్రకారం అమ్ముతున్నారా అనేది పర్యవేక్షించాలి. కానీ సుమారు రెండేళ్లగా ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం నుంచి సరైన సమాచారం ఉండడం లేదు. నెలవారీ ఎన్ని శాంపిల్స్ తీశారో.. ఎక్కడ కేసులు పెట్టారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే మామూళ్ల వసూళ్లు చేసుకుంటూ మత్తులో జోగుతున్నారు.. రూ.కోట్లు గడిస్తున్నారు. ప్రజలు మాత్రం పెద్దఎత్తున మోసపోతున్నారు.

ప్రతీ దానికో రేటు..

ఎవరైనా మెడికల్‌షాపు పెట్టుకోవాలంటే పదో తరగతి చదివితే చాలు. నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలో మందులు అమ్మాలి. డిగ్రీ చదివితే ఒక ఏడాది అనుభవంచాలు. ఎంత పెద్దషాపు పెట్టాలన్నా కేవలం 3 వేలు చలానా కడితే చాలు. లైసెన్స్ ఇవ్వడానికి మామూళ్లు భారీగానే ఇవ్వాలి. ఇక ప్రతి దుకాణం నుంచి ఆరు నెలలకోసారి రూ.5 వేలు వంతున మామూళ్లు ఇవ్వాలి. ప్రతి ఏటా ఇన్‌స్పెక్షన్ పేరిట వస్తే ఒక్కో షాపు కనీసం రూ.10 వేలు ఇవ్వాల్సిందే. ప్రతి షాపును ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలి. ఇది ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. కానీ దుకాణాన్ని బట్టి కనీసం రూ.25 వేల నుంచి మొదలవుతుంది. షాపు షిఫ్టింగ్‌కు రూ.15 వేల వంతున ఇవ్వాలి. ఇదంతా ఆయా ప్రాంతాల యూనియన్ నాయకులే స్వయంగా ఒక గుమస్తాతో వసూలు చేయిస్తారు. నెలకోసారో, వీలైనప్పుడో నేతలు స్వయంగా క్యాష్ బ్యాగ్ తీసుకుని వెళ్లి సదరు అధికారికి సమర్పించుకుంటారు. అక్కడి కొన్ని వాటాలు ఉంటాయి. ఇక్కడ కొందరు యూనియన్ నేతలు కూడా ఇష్టంలేని వారిపై దాడులు చేయిస్తారు. అప్పుడు అధికారులు వీరితో చేతులు కలుపుతారు. ఆరు నెలలకు దుకాణానికి రూ.5 వేల వంతున మొత్తం 3,500 దుకాణాల నుంచి రూ.1.75 కోట్ల మామూళ్లు వస్తాయని అంచనా. ఇన్‌స్పెక్షన్ పేరిట ఏడాదికి వసూలు చేసేది 3,500 దుకాణాల నుంచి రూ.3.50 కోట్లు. రెన్యూవల్‌కు ఐదేళ్లకోసారి రూ.5.25 కోట్లు వసూలు చేస్తారు. ఆకస్మిక తనిఖీలు, తప్పులు దొరికినప్పుడు వసూలు అదనం. ఆరు నెలల కిందట ఒక షాపు వద్ద డ్రగ్స్ దొరకడంతో భారీగా వసూలు చేసినట్టు ప్రచారం ఉంది.

నిధులివ్వండి సార్

- అమరావతిలో నేటి నుంచి రెండురోజులపాటు కలెక్టర్ల సదస్సు
- జిల్లాలో పలు కీలక అంశాలపై నివేదిక సిద్ధం చేసిన కలెక్టర్
- సీఎం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా ప్రణాళిక
- ఏలేరు ఆధునికీకరణకు నిధులివ్వాలని కోరనున్న షాన్‌మోహన్
- జిల్లాకు కీలకమైన జీజీహెచ్‌లో కొత్త బ్లాకుల నిర్మాణం తప్పనిసరి
- స్మార్ట్‌సిటీ, పాడాకు నిధులిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని వివరణ
- ఉప్పాడ బీచ్ రోడ్డు కోత, జయలక్ష్మి ఆస్తుల వేలంపై చర్చించే అవకాశం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాను అనేక కీలక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో నిధులు మంజూరుకాక పరిష్కారంకోసం ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వంలో ఇవన్నీ నెరవేరేలా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టిసారించారు. ఈ దఫా కలెక్టర్ల సదస్సులో పూర్తిగా జిల్లా కలెక్టర్లే ఆయా జిల్లాలకు సంబంధించి అభివృద్ధి ప్రణాళిక తయారుచేసి ప్రజంటేషన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో దీన్ని అనుకూలంగా మల్చుకుని పలు ముఖ్యమైన అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరయ్యేలా కసరత్తు పూర్తి చేశారు. ఈ మేరకు కీలకనివేదిక సిద్ధం చేసి సదస్సులో వివరించనున్నారు.

ఏలేరు ఆధునికీకరణ, ఉమ్మడి తూ.గో.జిల్లాకు కీలకమైన జీజీహెచ్ అభివృద్ధి, కాకినాడ స్మార్ట్‌సిటీ, పాడాకు నిధుల బెంగ తీర్చడం, ఉప్పాడ సముద్రపు కోత నివారణ, జయలక్ష్మి సొసైటీ ఆస్తులను వేలం వేయించి డిపాజిటర్లకు న్యాయం చేయడం వంటి పలు ప్రధాన అంశాలను కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించడానికి నివేదిక సిద్ధం చేశారు. వీటి అవశ్యకతను వివరించి నిధుల మంజూరు చేసేలా అంశాలను ప్రస్తావించబోతున్నారు.

జిల్లా ప్రగతికి ఇవే..

రాష్ట్ర ప్రభుత్వం నేటినుంచి రెండురోజులపాటు అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తోంది. ప్రతిసారి కలెక్టర్ల సదస్సులో ఆయా రాష్ట్రశాఖలకు చెందిన అభివృద్ధి అంశాలు, పనుల ప్రగతిపై సీనియర్ అయ్యేఎస్‌లు అయిన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు గంటల తరబడి ప్రజంటేషన్లు ఇచ్చేవారు. వీటిలో చేయాల్సిన, వెనుకబడిన అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్ వాటిని నోట్ చేసుకుని తిరిగి జిల్లాకు వచ్చి అధికారులతో సమీక్ష జరిపేవారు. ఈసారి ప్రభుత్వం స్టైల్ మార్చింది. కార్యదర్శుల సుదీర్ఘ ప్రజంటేషన్ల స్థానే నేరుగా జిల్లా కలెక్టర్లే తమ జిల్లాకు సంబంధించి శాఖలవారీగా ప్రగతి, ముఖ్య సమస్యలు, మూడు నెలల్లో వివిధ అంశాల్లో సాధించాల్సిన అభివృద్ధి, లక్ష్యాలపై ప్రజంటేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈనేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ జిల్లాలో 30 ప్రభుత్వశాఖలకు సంబంధించి పనితీరు నివేదికను తయారు చేశారు. ఇవికాకుండా ప్రధాన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, నిధుల మంజూరు అవసరం.. వీటి ద్వారా వచ్చే మూడునెలల్లో ఏమేర ప్రగతి సాధించే అవకాశం ఉంది? అనే కోణంలో నివేదికను సిద్ధం చేసి సీఎం సమక్షంలో వివరించనున్నారు. అందులో భాగంగా పలు ముఖ్య మైన సమస్యలను కలెక్టర్ తన ప్రజంటేషన్‌లో ప్రభుత్వం ముందు ఉంచి విధాన నిర్ణయాలు జరిగేలా కసరత్తు చేశారు. ఏలేరు ప్రాజెక్టుకు సంబంధించి పనులు జరిగేలా చేయడంతోపాటు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరబోతున్నారు. వర్షాలు, వరద వచ్చిన ప్రతిసారీ ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వేలాది ఎకరాలు నీటమునిగిపోతున్నాయి. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఏలేరు ఫేజ్1 పూర్తికి రూ.142కోట్లు, ఫేజ్2 పూర్తికి రూ.150కోట్లు ఇస్తా నని చెప్పి మోసగించింది. ఈలోపు సవరించిన అంచనాలు రూ.663కోట్లకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పలుసార్లు ప్రస్తావించారు. ఈనేపథ్యంలో రాబోయే వర్షాకాలం నేపథ్యంలో ప్రాజెక్టు పనులకు నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరబోతున్నారు.



కలెక్టర్ షాన్‌మోహన్

బాధితులకు న్యాయం ఆలస్యమైంది

ఉమ్మడి తూ.గో. జిల్లాలో పేదలకు పెద్దదిక్కు అయిన జీజీహెచ్‌లో ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. ఇవి వినియోగానికి పనికిరావని ఇంజినీర్లు నివేదికలు ఇచ్చినా నిధులు లేక అదే భవనాల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్నపాటి వర్షానికే స్లాబులు లీకై వర్షం నీరు కిందికి చేరుకుని అత్యంత ప్రమాదకరంగా మారాయి. కొత్త బ్లాకుల నిర్మాణానికి రూ.500కోట్ల వరకు అవసరమని ఇప్పటికే నివేదిక తయారవగా, ఈనిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరబోతున్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100కోట్ల నిధులు ఇస్తుంది. అదే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వంతు ఏటా ఇంకో రూ.100కోట్లు సమకూర్చాలి. పిఠాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(పాడా)కు నిధులు మంజూరు చేయాలని కోరనున్నారు. కాకినాడ కేంద్రంగా జయలక్ష్మి సొసైటీ బ్యాంకు రూ.520 కోట్ల మేర డిపాజిటర్లను మోసం చేసింది. ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ కోరనున్నారు. ఉప్పాడ వద్ద సముద్రం ముందుకు వస్తూ కలవరపెడుతోంది. కోతను నివారిస్తామని ఎన్నికలప్పుడు కూటమి హామీ ఇచ్చింది. 12కిలోమీటర్లమేర ఈ కోత నివారణ ప్రణాళికకు రూ.250కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనావేశారు. ఈనేపథ్యంలో కోత నివారణ పనులు ప్రారంభించడానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరనున్నారు.

లంబసింగికి చేరిన.. క్యాంప్ రాజకీయం

- కాకినాడ రూరల్ ఎంపీపీ పదవికి 27న ఎన్నిక
- జనసేనలో చేరిన ఏడుగురు వైసీపీ ఎంపీటీసీలు
- మొత్తం పదిమంది లంబసింగికి తరలింపు
- ఎమ్మెల్యే కుమారుడి నేతృత్వంలో ప్రత్యేక శిబిరం
- ఎన్నికల అధికారిగా డ్వామా పీడీ నియామకం

సర్పవరం జంక్షన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండల పరిషత్తు అధ్యక్ష(ఎంపీపీ) ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఈనెల 27న జరగనున్న పదవి ఎన్నికకోసం 10మంది సభ్యులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రత్యేక శిబిరానికి తరలించారు. జనసేనకు చెందిన ముగ్గురితోపాటు ఇటీవల వైసీపీని వీడి జనసేనలో చేరిన ఏడుగురు సభ్యులను ముందు జాగ్రత్తగా లంబసింగి ప్రాంతానికి తరలించారు. ఎమ్మెల్యే కుమారుడు సందీప్ నేతృత్వంలో పార్టీ నాయకులతో కలిసి ఎంపీటీసీ సభ్యులను రిసార్ట్‌లో ఉంచి పర్యవేక్షిస్తున్నారు.

కాకినాడ రూరల్ ఎంపీపీ పీఠం 15మంది ఎంపీటీసీల సభ్యులతో వైసీపీకి దక్కించుకోగా కొవ్వాడ ఎంపీటీసీ సభ్యురాలు గోపిశెట్టి పద్మజ ఎంపీపీగా 2024, 30 జూన్ వరకు కొనసాగారు. అనంతరం ఇదేరోజున తన పదవికి రాజీనామా చేయడంతో ఈ పదవి భర్తీకోసం ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ రూరల్ మండలంలో 18మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా మారిన రాజకీయ పరిణామాలతో జనసేనకు 10మంది సభ్యులతో సాధారణ బలం లభించింది. సులువుగా ఎంపీపీ పీఠాన్ని జనసేన కైవసం చేసుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈఎన్నిక లాంఛనమే అయినా ఎమ్మెల్యే పంతం నానాజీ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. 10మంది ఎంపీటీసీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రగా ఆదివారం లంబసింగి ప్రాంతంలోని రిసార్ట్‌లోకి తరలించారు. ఎమ్మెల్యే కుమారుడు సందీప్, పార్టీనాయకులు అక్కడ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. మరో ఇద్దరు వైసీపీ సభ్యులు జనసేనలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు. జనసేన ఎంపీపీ అభ్యర్థిగా పండూరు ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మిని ఎమ్మెల్యే ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ ఎన్నిక అధికారిగా డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పదో తరగతి గణితం పరీక్షకు 27,931మంది హాజరు

కాకినాడ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 142 పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగిన పరీక్షకు మొత్తం 28,224మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 27,931మంది హాజరైనట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. జిల్లా పరిశీలకులు 6, అసిస్టెంట్ కమిషనర్ 4, డీఈవో 3, తనిఖీ అధికారులు 41పరీక్షాకేంద్రాలను తనిఖీచేశారు. ఓపెన్‌స్కూల్ గణితం పరీక్షకు మొత్తం 2215మంది విద్యార్థులు హాజరుకావాల్సిఉండగా 2025మంది హాజరుకాగా 190మంది విద్యార్థులు పరీక్ష రాయలేదని పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 482 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులను నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తోపాటు జేసీ రాహుల్‌మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ మొత్తం 482 అర్జీలు స్వీకరించారు. కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామ లక్ష్మి, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 80 అర్జీలు

కాకినాడ క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై 80మంది అర్జీదారులు సోమవారం పోలీస్‌గ్రీవెన్స్‌లో ఎస్పీ జి.బిందు మాధవ్‌కు అర్జీలు అందజేశారు. ఫిర్యాదుదారుల గోడు విన్న ఎస్పీ ఎస్‌డీపీవోలు, సీఐలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమస్య సమ్మతమైనదైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలన్నారు.

కలెక్టరేట్ వద్ద విద్యుత్ మీటర్స్ రీడర్ల ధర్నా



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యుత్తు మీటర్ల రీడర్లు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్‌మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాకినాడ కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నాచేశారు. విద్యుత్ మీటర్స్ రీడర్స్ అసోసియేషన్ ప్రతినిధి ఎం.వీరబాబు మాట్లాడుతూ విద్యుత్‌సంస్థను 15ఏళ్లుగా నమ్ముకుని బతుకుతున్నామని, స్మార్ట్ మీటర్లవల్ల ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు: ఎస్పీ

కాకినాడ క్రైం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లను నిర్వహించినా,ప్రోత్సహించినా చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందు మాధవ్ హెచ్చరించారు. ఐపీఎల్ 20-20 క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా, దాడుల కోసం స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు సోమవారం రాత్రి ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్‌బెట్టింగ్‌లకు పాల్పడే నిర్వాహకులు, ఆడేవారిపై నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా క్రికెట్‌బెట్టింగ్‌లు జరుగుతుంటే డయల్ 112 లేదా 100 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9494933233కు సమాచారం అందించాలని కోరారు.



నవమి.. తెచ్చింది కళ!

- కొబ్బరి రైతులకు కలిసొచ్చిన శ్రీరామనవమి
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా కొబ్బరి ఎగుమతులు
- నిత్యం 75 లారీలకు పైగా కోనసీమకు ఆర్డర్లు
- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- వెయ్యి కొబ్బరికాయల ధర రూ.14 వేలు

అంబాజీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జనవరి తరువాత కొబ్బరికాయలకు మంచి ధర ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల్లో నుంచి ఆశించిన మేర ఆర్డర్లు లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు సన్నగిల్లాయి. ఉగాది, శ్రీరామనవమి పండుగల నేపథ్యంలో రైతులు, వ్యాపారులకు ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఆనందంగా ఉన్నప్పటికీ కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. శ్రీరామనవమి పండుగను దేశవ్యాప్తంగా వైభవంగా నిర్వహించుకోనున్న నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి కోనసీమ వ్యాపారులు, రైతులకు భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్ ఊపందుకుంది. గతేడాది ఇదే సమయంలో 20 నుంచి 25 లారీల ఎగుమతులు జరగగా, ప్రస్తుతం కోనసీమతోపాటు ఉభయగోదావరి జిల్లాల నుంచి 100 లారీలకుపైగా ఎగుమతులు జరుగుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్, బీహార్, అస్సాం, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌తోపాటు ఈ ఏడాది జమ్ముకాశ్మీర్ రాష్ట్రం నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఉగాది సందర్భంగా కర్ణాటకలో గుడిపావడా పండుగను వైభవంగా నిర్వహిస్తారు. అక్కడ కొబ్బరికాయలను ఈ పండుగకు ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో ఆ రాష్ట్రానికి కొబ్బరి ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. అలాగే కోల్‌కత్తాలో ప్రతి అమావాస్యకు ఆ ప్రాంత ప్రజలు కొబ్బరిని ఎక్కువగా వినియోగిస్తారు. ఈ ఏడాది శివరాత్రికి భారీగా ఆర్డర్లు వస్తాయని భావించిన రైతులు తమ కల్లాల్లో భారీగా కొబ్బరికాయల నిల్వ చేసుకుని ఉంచారు. అయితే శివరాత్రికి ఆశించినంత మేర ఆర్డర్లు లేకపోవడంతో రైతుల వద్దే కొబ్బరికాయల రాశులు నిలిచిపోయాయి. అయితే పండగలు పూర్తయినప్పటికీ ఎండలు పెరగడం వల్ల కూడా ప్రస్తుతం కొబ్బరి ఎగుమతులు భారీగా జరుగుతున్నాయని వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పచ్చికొబ్బరికాయలు రూ.14 వేలు పైబడి కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో కొబ్బరి దిగుబడి తగ్గడం ఇక్కడ ఎగుమతులు ఊపందుకోవడానికి మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. ప్రధానంగా శ్రీరామనవమి ప్రభావం వల్ల ఈ స్థాయిలో ఎగుమతులు మరో నాలుగు రోజులు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నవమి మార్కెట్ పూర్తయితే ఎగుమతులు తిరిగి యథాస్థితికి వస్తాయని చెబుతున్నారు.



కాయలను లారీల్లో ఎగుమతి చేస్తున్న కూలీలు

వేధిస్తున్న కూలీల కొరత...

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడం లేదనే చందంగా మారింది కోనసీమలో కొబ్బరి రైతులు, వ్యాపారుల పరిస్థితి. కోనసీమ కొబ్బరి మార్కెట్‌లో ఎగుమతులు ఊపందుకున్నప్పటికీ ఒలుపు కార్మికులు, లోడింగ్ కూలీలు, లారీల కొరత వేధిస్తుండడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్డర్లను సకాలంలో అందించలేకపోతున్నారు. దీనికితోడు లోడింగ్ చేసేవారు, లారీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో కొంతమంది వ్యాపారులు ఆర్డర్లు వచ్చినప్పటికీ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఆర్డర్లను తిరస్కరిస్తున్నారు.



కాకినాడ కలెక్టరేట్‌లో జాబ్‌మేళా కార్యక్రమానికి విచ్చేసిన నిరుద్యోగ అభ్యర్థులు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉద్యోగ మేళాకు.. భారీ స్పందన

- 350 పోస్టులకు గాను 1200మంది హాజరు
- అభ్యర్థులతో కిటకిటలాడిన కాకినాడ కలెక్టరేట్
- ఉభయగోదావరి జిల్లాలతోపాటు గుంటూరు, విజయవాడల నుంచి వచ్చిన నిరుద్యోగులు
- గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సంస్థలో ఉద్యోగాలు
- తొలిరోజు 125మంది ఎంపిక
- నేడు కూడా ఇంటర్వ్యూలు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్ర జ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస సంస్థలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచి 1200మంది అభ్యర్థులు హాజరయ్యారు. ప్రధానంగా కాకినాడ జిల్లా కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, విజయవాడ, గుంటూరు వంటి ప్రాంతాల నుంచి నిరుద్యోగులు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉదయం 9గంటలనుంచి ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభమైంది. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కంటెంట్ అనలిస్ట్ ఉద్యోగాలకు వాకిన్‌డ్రైవ్ నియామకాలు నిర్వహించారు. తొలిరోజు సోమవారం 1200మంది అభ్యర్థులు హాజరుకాగా 125మందికి ఉద్యోగాలు ఇచ్చారు. వీరు వర్క్‌ఫ్రం హోమ్ విధానంలో 8గంటలపాటు పనిచేయాల్సిఉంది. ఇంజినీరింగ్‌తోపాటు నాన్ ఇంజినీరింగ్ గ్రూప్ విద్యార్థులకు కూడా అవకాశం ఇచ్చారు. ఈ సంస్థ సేవలు హైదరాబాద్‌లోను ఉన్నాయి. అక్కడ పనిచేసే అభ్యర్థులకు వసతి సౌకర్యంతోపాటు భోజన వసతి కూడా కల్పిస్తున్నారు.

కిక్కిరిసిన కాకినాడ కలెక్టరేట్

ఉదయం 9గంటలకే కాకినాడ కలెక్టరేట్‌లో వికాస కార్యాలయానికి చేరుకున్న అభ్యర్థులతో ఆప్రాంతం కిక్కిరిసింది. అక్కడికి వచ్చిన కొందరికి దరఖాస్తులు ఇవ్వకపోవడం వల్ల అభ్యర్థులు ఎగబడ్డారు.ఈవిషయాన్ని గమనించిన వికాస ఉద్యోగులు తర్వాత అందరికీ దరఖాస్తులు అందేలా చర్యలు తీసుకున్నారు. అభ్యర్థులతో లోపల ప్రాంగణమంతా నిండిపోయి కోలాహలంగా దర్శనమిచ్చింది. వీరు కూర్చోవడానికి టెంట్లు ఏర్పాటు చేశారు.

ఆంగ్లంపై పట్టున్నవారికే అవకాశం

ఇంటర్వ్యూల్లో ఆంగ్ల భాషపై, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు ఉన్నవారికే ఉద్యోగాలు వచ్చాయి. సంస్థ ప్రతినిధులు 12మంది మూడు రౌండ్లలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళా మంగళవారంకూడా ఉంటుందని, అభ్యర్థులు వివరాలకు 7799376111, 7799376444 నెంబర్లలో సంప్రదించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు.వికాస పీడీ లచ్చారావు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ కోసం వేచిఉన్న అభ్యర్థులు

రూ.87కోట్ల నీటి చార్జీలు చెల్లించండి

- కాకినాడలోని ఏడు పరిశ్రమలకు రెండోసారి నోటీసులు జారీ
- 15రోజుల్లోగా స్పందించకపోతే కఠిన చర్యలు: కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఏడు పరిశ్రమలకు రూ.87కోట్లకుపైగా నీటి చార్జీలు చెల్లించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ రెండోసారి నోటీసులు జారీ చేశారు. వీటి నీటి వినియోగ చార్జీలు 2019నుంచి నేటివరకు రూ.87కోట్ల21లక్షల91వేల బకాయి ఉన్నందున వాటిని చెల్లించాల్సిందిగా ఈనెల 7న కలెక్టర్ మొదటిసారి నోటీసులు జారీ చేశారు. ఆయా పరిశ్రమలనుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మళ్లీ సోమవారం నోటీసులు జారీ చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాకినాడ పరిసర ప్రాంతాల్లోఉన్న నాగార్జున ఫెర్టిలైజర్స్, కాకినాడ సీపోర్టు, జీఎంఆర్ ఎనర్జీ లిమిటెడ్, ఎంవీ శశిధర్ అండ్‌కో, అశోక్ ఎంటర్‌ప్రైజస్, అంజని ఏజెన్సీస్, అన్నపూర్ణ మెరైన్స్‌నుంచి రూ.87కోట్ల 21 లక్షల91వేల నీటి వినియోగ బకాయిలు చెల్లించాలని ఒకసారి నోటీసులుఇచ్చామని, ఆ పరిశ్రమలు స్పందించకపోవడంతో మళ్లీ నోటీసులు ఇచ్చామని తెలిపారు. దీనిపై 15రోజుల్లోగా స్పందించకపోతే తదుపరి కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

కాకినాడ జిల్లా మెప్మా గిన్నిస్ రికార్డు

- ఆన్‌లైన్ యాప్ ద్వారా లక్ష్యానికి మించి అమ్మకాలు
- మెప్మా పీడీకి కాకినాడ కలెక్టర్ అభినందనలు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మెప్మా మహిళా స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులు వావ్‌జెని ఆన్‌లైన్ యాప్‌ద్వారా లక్ష్యానికి మించి ఉత్పత్తులు విక్రయించినందుకు మెప్మా సంస్థ గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించింది. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లామెప్మా పీడీ బి.ప్రియంవద కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఒక్కరోజులో లక్షకు పైగా ఉత్పత్తులు విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడంతో మెప్మా పీడీని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.



కాకినాడ జిల్లా మెప్మా పీడీని అభినందిస్తున్న కలెక్టర్

ఏపీఈఏపీసెట్‌కు 1,12,606 దరఖాస్తులు

- మే 19 నుంచి 27 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ
- అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు
- కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు



కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే,మార్చి24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2025కు ఇప్పటివరకూ 1,12, 606 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఇంజనీరింగ్‌కు 86,282మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 26,075, రెండింటికీ 249మంది దరఖాస్తుచేసుకున్నారన్నారు. ఈప్రవేశపరీక్షకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 24వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని మే19 నుంచి 27వ తేదీవరకూ ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించనున్నామన్నారు. ఏపీ వ్యాప్తంగా 46, తెలంగాణాలోని హైదరాబాద్‌లో 2 కేంద్రాలు మొత్తం 48కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కె.రాము, ఎస్.సుమతి కోకన్వీనర్లుగానూ, ప్రొఫెసర్లు చంద్రశేఖర్, రాజశేఖర్, దిలీప్‌కుమార్, ఉషాదేవి, జయప్రసాద్‌లు సభ్యులుగానూ నియామకమయ్యారు విద్యార్థులు https://cets. apsche. ap.gov.in వెబ్‌సైట్‌ద్వారా ఆన్‌లైన్ విధానంలో తమ దరఖాస్తులను పూరించాలన్నారు.

- మే 19నుంచి 20వరకూ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగాలకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామని ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన పరీక్షలను మే 21నుంచి 27వ తేదీ వరకూ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మే24న పరీక్ష ఒక సెషన్‌లో మాత్రమే ఉంటుందని 25న పరీక్ష ఉండదన్నారు. పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకూ, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకూ జరుగుతాయని తెలిపారు.

- ఓసీ విద్యార్థులు రూ.600, బీసీ విద్యార్థులు రూ.550, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.500 చొప్పున ఆన్‌లైన్ గేట్‌వే ద్వారా దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. రూ.1000 అపరాధ రుసుంతో మే1, రూ.2000తో మే7, రూ.4000తో మే 12, రూ.10,000 అపరాధ రుసుముతో మే 16వ తేదీవరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచు కున్న విద్యార్థులకు కర్నూలు ప్రాంతీయ కేంద్రంలో మాత్రమే పరీక్షా కేంద్రాన్ని కేటాయిస్తామని తెలిపారు. ఈఏడాది ఏపీఈఏపీసెట్ దరఖాస్తులో కొత్తగా అపార్ ఐడీ ఆప్షన్ ఇస్తామని ఇది ఆప్షనల్ మాత్రమేనని అపార్ ఐడీ లేకపోయినా పరీక్షకు అనుమతిస్తామన్నారు. కౌన్సెలింగ్ సమయానికి తమ ఇంటర్మీడియట్ కళాశాల ద్వారా అపార్‌ఐడీ పొందాల్సి ఉంటుందని ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హతున్న విద్యార్థులు దరఖాస్తులను పూరించేటప్పుడు నూతన ఆదాయ ధ్రువీకరణపత్రం నెంబర్‌ను నమోదు చేయాలన్నారు. అదేవిధంగా రిజర్వేషన్ పొందే విద్యార్థులు కులధ్రువీకరణ పత్రం నెంబర్‌ను నమోదుచేయాలని తెలిపారు.

● 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాలి

విద్యార్థులు తప్పనిసరిగా తమకు సమీపంలోని 5 కేంద్రాలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని వాటిని ప్రాధాన్యతా క్రమంలోఎవరు ముందుగా ఎంపిక చేసుకుంటారో వారికి మొదటి ప్రాధాన్యతా కేంద్రాన్ని కేటాయిస్తామన్నారు. ఈఏపీసెట్‌లో 75శాతం, 10+2 పరీక్షల్లోని గ్రూప్ మార్కుల నుంచి 25శాతం వెయిటేజీతో కలిపి ర్యాంకులు కేటాయిస్తామన్నారు. విద్యార్థులు తమ దరఖాస్తులో ఏదైనా సమాచారాన్ని తప్పుగా పూరిస్తే మే 6నుంచి 8వరకూ సవరించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. మే 12నుంచి విద్యార్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వాటితోపాటూ ర్యాంకు కార్డులను ఈఏ పీసెట్ వెబ్‌సైట్‌తోపాటూ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కూడా విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తికోసం https://cets. apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారాగానీ 0884 2359599, 2342499 ఫోన్ నెంబర్లలోగానీ helpdeskapeapcet @apsche.org మెయిల్ ఐడీ ద్వారాగానీ సంప్రదించవచ్చని కన్వీనర్ సుబ్బారావు సూచించారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో పరీక్షలు

● జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఈనెల 25, 26, 27 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కంప్యూటర్ బేసిడ్ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లుచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఏపీపీఎస్సీ అధికారులు, రెవెన్యూ, ప్రజారవాణా, పోలీస్, వైద్యఆరోగ్యం తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ హెల్త్ సైన్స్ అసిస్టెంట్ లైబ్రేరియన్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్, అనలిస్ట్ గ్రేడ్-2, ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల ఉద్యోగుల భర్తీకి సంబంధించి ఈనెల 25నుంచి 27వరకు మూడు రోజుల పాటు జిల్లాలో నిర్వహించే కంప్యూటర్ బేసిక్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పరీక్షల నిర్వహణకుగాను జిల్లాలో కాకినాడ పట్టణంలో ఎస్. అచ్యుతాపురం వద్ద నున్న ఆయాన్ డిజిటల్ టెక్నాలజీ, కాకినాడరూరల్‌లోని స్వాప్ టెక్నాలజీ, సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే పరీక్షల నేపథ్యంలో ఈమూడు కేంద్రాల పరిధిలోని మండలాల్లో 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. మూడురోజులు రెండుపూటలా ఉదయం, మధ్యాహ్నం జరిగేపరీక్షలు సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఎండవేడి ఎక్కువగా ఉంటున్నందున వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి అవసరమైన ఓఆర్ఎస్ ఇతర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 8గంటల నుంచి 8.45 వరకు మధ్యాహ్నం 1గంట నుంచి 1.45 నిమిషాల వరకు అనుమతిస్తామన్నారు. ఉదయం పరీక్ష 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీఎస్సీ సెక్షన్ అధికారి ప్రశాంత్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా 5వేల క్యూసెక్కులు గోదావరిడెల్టాకు విడుదలవుతుండగా మరో 4వేల క్యూసెక్కులు పైబడి పవర్ జనరేషన్‌ద్వారా విడుదలవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,468క్యూ సెక్కులుగా నమోదుకాగా ధవళేశ్వరంవద్ద నీటి మట్టం 9.70అడుగులుగా నమోదైంది.

భావనారాయణస్వామికి రూ. 2,11,500 ఆదాయం

సర్పవరం జంక్షన్, మార్చి24 (ఆంధ్ర జ్యోతి): కాకినాడరూరల్ సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామిస్వామి ఆలయంలో చేపలచెరువు, ఫొటో, వీడియోలు తీసుకునేందుకు నిర్వహించిన బహిరంగ వేలంపాటలో రూ.2,11,500లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం ఈవో లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్వామివారికి చెందిన చేపల చెరువుకి 3నెలల కాలపరిమితికి వేలంపాట నిర్వహించగా, హెచ్చుపాటకు రూ.1,08,000లకు పాడుకున్న వ్యక్తికి వేలంపాట ఖరారు చేశామన్నారు. వివాహాది, శుభకార్యాల ఫొటో, వీడియోలు, వీడియోషూట్‌ల నిర్వహణకోసం లైసెన్స్ హక్కుకోసం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలో రూ.1,03,500 పాడిన వ్యక్తికి టెండర్ ఖరారు చేశామన్నారు.



సైబర్..ర్..ర్!

- సైబర్ నేరాల్లో పోగొట్టుకుంది రూ.18 కోట్లు
- అధికారులు వెనక్కి తెచ్చింది రూ.8 లక్షలు
- నాలుగేళ్లలో తూర్పున ఇదీ లెక్క
- లబోదిబోమంటున్న బాధితులు

రాజమహేంద్రవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైంలో జనాలు పోగొట్టుకున్న సొమ్ము వెనక్కి రావడం అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. గత నాలుగేళ్లలో పోలీస్ రికార్డులు చూస్తే గుండె గుబేల్ మంటుంది. సైబర్ నేరగాళ్లు దోపిడీ చేసింది భారీగా ఉంటే రికవరీ అయ్యి చేతికి వచ్చింది మాత్రం ఆవగింజంత మాత్రమే ఉండడం ఆందోళన కలిగిస్తుంది. జిల్లాలో గత నాలుగేళ్ల లెక్కలను పరిశీలిస్తే పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

గత నాలుగేళ్లలో సైబర్ నేరాల గణాంకాలు..

2022లో 114 సైబర్ నేరాలు జరగ్గా రూ.1,34,43,000లు నష్టపోగా రూ.6,50,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ.1,40,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2023లో 101 సైబర్ నేరాలు జరగ్గా రూ.3,14,19,000లు నష్టపోగా రూ.17,82,000లు హోల్డ్‌చేశారు. వాటిలో రూ.3,09,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2024లో 104 సైబర్‌నేరాలు జరగ్గా రూ. 10,10,51,000లు నష్టపోగా రూ. 1,62,47,000లు హోల్డ్ చేశారు. వాటిలో రూ. 3,75,000లు మాత్రమే వెనక్కి వచ్చింది. 2025లో 25 సైబర్‌నేరాలు జరగ్గా రూ.2,76,40,000లు నష్టపోగా రూ.7,30,000లు హోల్డ్ చేశారు. ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా తిరిగి రాలేదు. జిల్లాలో నమోదైన సైబర్ నేరాల గణాంకాలను పరిశీలిస్తే పోలీసులు అతిస్వల్పంగా కేసులు నమోదు చేసినట్టు తెలుస్తుంది. ప్రతిరోజు జిల్లా కేంద్రంలోని సైబర్ సెల్‌కి కనీసం 5కు పైగా ఫిర్యాదుదారులు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లను కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. సైబర్ నేరం జరిగిందని ఫిర్యాదుదారుడు పోలీస్ స్టేషన్‌కు వస్తున్నా కేసులు నమోదు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని బాధితులు వాపోతున్నారు. తీరా కేసులు నమోదు చేసినా ఆ కేసులు విచారణకు నోచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

మరిడమ్మ హుండీ ఆదాయం రూ4.61లక్షలు

పెద్దాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి తెలిపారు. 97 రోజులు కాలానికి రూ.4,61,845 ఆదాయం సమకూరిందని ఆమె తెలిపారు. అన్నదాన హుండీల ద్వారా 129 రోజుల కాలానికి రూ.43,069 ఆదాయం సమకూరిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి అధ్యయనోత్సవాలు

● వాడపల్లిలో ఉత్సవాలకు ఏర్పాట్లు

ఆత్రేయపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి అధ్యయనోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవాలకు ముందుగా స్వామివారి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తారు. ఈ నెల 29 వరకూ జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ద్రవిడ వేద పారాయణం, పల్లకి మహోత్సవం, గరుడ, సింహ వాహనసేవలు జరుగుతాయి. ఏప్రిల్ 7నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. సోమవారం తిరుమంజన సేవా కాలం నిర్వహించారు. భక్తులకు స్వామి నిజరూప దర్శనం కలిగింది. అశేష భక్తజనం దర్శించుకున్నారు. ఇదిలావుండగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నోము ఆచరించి, అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,95,811 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గంజాయికి.. గోదారి

రూటు మార్చిన స్మగ్లర్లు

● ఒడిశా నుంచి వయా పోలిపాక మీదుగా తరలింపు

● పడవరేవును పరిశీలించిన తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

కూనవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పోలీసుల తనిఖీలు ఎక్కువవుతుంటే మరోవైపు స్మగ్లర్లు సైతం తమ రూటును మార్చుకుంటున్నారు. వెళ్లినదారిలోనే వెళితే కిక్కు ఏముంది అనుకుంటున్నారో ఏమో కొత్త మార్గాలు అన్వేషించుకుంటూ తమ అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అయినా ఎక్కడో ఒక చోట పోలీసులకు దొరికిపోయి కటకటాల పాలవుతున్నారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ నుంచి గంజాయిని తెలంగాణకు తరలించాలంటే సాధారణంగా స్మగ్లర్లు భద్రాచలం మార్గం వైపు తీసుకెళ్తారు. కానీ అక్కడ తనిఖీలు ఎక్కువవుతుండడంతో కూనవరం మండలం పోలిపాక గోదావరి పడవ రేవును ఈసారి ఎంచుకున్నారు. నాలుగు రోజుల క్రితం ఇక్కడి నుంచి సుమారు రూ.60.57లక్షలు విలువచేసే గంజాయిని తరలిస్తూ తెలంగాణలోని బూర్గంపాడు పోలీసులకు దొరికిపోయారు. ఈ వ్యవహారంలో మొత్తం తొమ్మిది మంది సూత్రధారులు ఉండగా ఇందులో కూనవరం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు తెలంగాణ పోలీసులు నిర్ధారించారు. వీరిలో పోలిపాక గ్రామానికి చెందిన ఎడముత్యం వంశీతో పాటు గంజాయిని పడవ ద్వారా తరలించిన పడవ యజమాని ఎల్లాజీ కూడా ఉన్నట్టు అక్కడి డీఎస్పీ సతీష్ ఇటీవల జరిగిన అక్కడ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. అయితే మండలంలో గంజాయి తరలింపు సంఘటన వెలుగులోకి రావడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో సోమవారం తెలంగాణ ఎక్సైజ్ అధికారులు మండలంలోని పోలిపాక పడవరేవును సైతం పరిశీలించారు. వాస్తవానికి పోలిపాక పడవరేవు ప్రభుత్వం ఆధీనంలో నడిచేది. పోచవరం కాలనీ పంచాయతీ అధికారులు ఈ పడవరేవు వేలంపాటను నిర్వహించేవారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో కచ్చులూరు లాంచీ ప్రమాదం జరగడంతో అక్కడి నుంచి పోలిపాక పడవరేవు వేలంపాటను నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ పడవరేవు వేలంపాట నిర్వహించకపోవడంతో ఈ పంచాయతీకి సైతం ఆదాయమార్గం తగ్గిపోయింది. దీంతో కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు ఇక్కడ పడవరాకపోకలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వం ఇక్కడ అధికారికంగా పడవరేవు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.


పోలిపాక వద్ద రేవును పరిశీలిస్తున్న తెలంగాణ ఎక్సైజ్ అధికారులు

ఈత సరే.. గీత దాటొద్దు!

విద్యార్థులు, చిన్నారులకు ఈత కొట్టడం అంటే ఓ సరదా. కానీ అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలోని వేట్లపాలెం, జీ.మేడపాడు గ్రామాల వద్ద గోదావరి కాలువ వెంబడి మధ్యాహ్న సమయంలో విద్యార్థులు ఈతకొడుతూ కనిపించారు. ఇది చూడడానికి సరదాగా ఉన్నప్పటికీ నీరు లోతుగా ఉండడం, తూటుకాడ, గుర్రపుడెక్క ఎక్కువగా ఉండడంతో ఒకింత లోపలికి వెళితే ప్రమాదం పొంచి ఉండే అవకాశం లేకపోలేదు. ఇక్కడే కాదు అనేక చోట్ల ఇలాంటి పరిస్థితి లేకపోలేదు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లిన ఇద్దరు చిన్నారుల మృతి చెందారు. ఇప్పుడు అసలే వేసవికాలం. అందువల్ల తల్లితండ్రులు జాగ్రత్త లు తీసుకుని లోతైన కాలువలు, చెరువుల్లోకి పిల్లలను ఈతకు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)


సామర్లకోట మండలం వేట్లపాలెం గోదావరి కాలువలో ఈతకొడుతున్న చిన్నారులు

రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో
కోనసీమ కలెక్టరేట్ జట్టు విన్నర్


విజేతగా నిలిచిన కలెక్టరేట్ బృందానికి షీల్డు అందజేసిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కలెక్టరేట్ జట్టు విన్నర్‌గాను, అమలాపురం రెవెన్యూ డివిజన్ బృందం జట్టు రన్నర్‌గాను నిలిచినట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి, కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావుల పర్యవేక్షణలో జిల్లా రెవెన్యూ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించినట్టు తెలిపారు. విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్లకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి షీల్డులు అందజేశారు. క్రీడా పోటీలకు వ్యాఖ్యాతగా ఎస్పీ భరత్ వ్యవహరించారు. రెవెన్యూ ఉద్యోగులు రెట్టించిన ఉత్సాహంతో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. విధి నిర్వహణలో మానసిక ఒత్తిడిని అధిగమించి మానసిక ఉల్లాసాన్ని పొందేందుకు క్రీడలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టరేట్ బృందానికి కెప్టెన్‌గా కిశోర్, అమలాపురం డివిజన్ జట్టుకు కెప్టెన్‌గా శివ వ్యవహరించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిరణ్, బెస్ట్ బౌలర్‌గా కృపాపాల్ నిలిచారు. విన్నర్స్ బృందంలో కిరణ్, శేషు, సుధీర్‌కుమార్, రన్నర్స్ జట్టులో శివ, యాకుబ్, కల్యాణ్‌లు అద్భుత ప్రతిభ చాటారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలో జరిగిన తల్లీకూతురి హత్య కేసులో నిందితుడు పల్లి శివకుమార్‌ను అరెస్టు చేసినట్టు ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లో లైట్ మెన్‌గా పనిచేస్తూ పరిచయమైన శ్రీకాకుళం జిల్లా కొత్తవీధి నందిగామ మండలానికి చెందిన శివకుమార్, సుమ్యా ప్రేమించుకున్నారు. తండ్రి మరణించడంతో తల్లి సాల్మాతో కలిసి రాజమహేంద్రవరం రూరల్ మండలం నామవరం శాటిలైట్ సిటీలోకి 3నెలల క్రితం సుమ్యా వచ్చి ఇక్కడే ఉంటోంది. కొంతకాలంగా శివకుమార్ వచ్చి వెళ్తున్నాడు. ఇటీవల సుమ్యా వేరొకరితో ఫోన్లో మాట్లాడడాన్ని గమనించిన శివకుమార్ నామవరం వచ్చి ఆదివారం రాత్రి తల్లి సాల్మాను నిలదీశాడు. సుమ్యాను సాల్మానే ప్రోత్సహిస్తుందని ఆమెతో గొడవపడ్డాడు. ఆదివారం తెల్లవారుజామున ఫోను మాట్లాడేందుకు సుమ్యా మేడపైకి వెళ్లిన సమయంలో వారి వంట గదిలో ఉన్న కత్తిని తీసుకుని మంచంపై పడుకున్న సాల్మా గొంతుకోసి అటుపై తలుపు పక్కనే వేచి ఉంచి సుమ్యా లోపలికి వచ్చే క్రమంలో ఆమెపై దాడి చేసి హత్య చేశాడు. అటుపై అక్కడి నుంచి పరారయ్యాడు. కొవ్వూరు రూరల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. సోమవారం నిందితుడిని కొవ్వూరు నుంచి తీసుకువచ్చి అరెస్టు చేసినట్టు చెప్పారు. మరో పక్క సాల్మా, సుమ్యా మృతదేహాలకు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆర్థిక లావాదేవీల కారణంగా..
తమ్ముడిని చంపిన అన్న


మరణించిన సుగ్గిరెడ్డి

మారేడుమిల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం మారేడుమిల్లి మండలం తాడేపల్లి పంచాయతీ నీలవరం గ్రామంలో దారుణం జరిగింది. ఆర్థిక లావాదేవీల కారణంగా తమ్ముడిని అన్న విల్లంబులతో హత్య చేసిన ఘటన వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం సుమారుగా 11 గంటల సమయానికి తంబుడు సుగ్గిరెడ్డి అనే వ్యక్తిని తన అన్న అయిన తుంబుడు లచ్చిరెడ్డి సుగ్గిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు ఎప్పుడు ఇస్తావు అంటూ గొడవ పడి తన వెంట తీసుకువెళ్లిన విల్లంబులతో దాడికి పాల్పడ్డాడు. దీంతో సుగ్గిరెడ్డి అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతిచెందిన వ్యక్తికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సాదిక్, గుర్తేడు ఎస్ఐ పార్థసారధి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్‌కు వెళ్లి చిరకాల మిత్రులు మృతి

హైవేపై అతి వేగంగా ఢీకొన్న కారు

సంఘటనా స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు మరణం


మరణించిన హనుమంతు, సురేష్ (ఫైల్)

పెరవలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా జాతీయ రహదారి అన్నవరప్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా పిట్ల వేమవరానికి చెందిన మాకా సురేష్(26), నేతల హనుమంతు (26) ఇద్దరు చిరకాల మిత్రులు. ఎక్కడికి వెళ్లినా కలిసి మెలిసి తిరిగేవారు. అలాగే కూలీ పనులకు వెళ్తూ తమ కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండే వారు. ఈ క్రమంలో వారు సోమవారం ఉదయం చికెన్ కోసం అన్నవరప్పాడు సెంటర్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. రావులపాలెం నుంచి తణుకు వైపు వెళ్తున్న మారుతీ కారు అతి వేగంగా వచ్చి వారి మోటారు సైకిల్‌ను ఢీకొనడంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. హనుమంతును ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం



సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే పోలీ స్టేషన్ పరిధి అనపర్తి-బిక్కవోలు రైల్వే ట్రాక్‌పై సోమవారం గుర్తు తెలియని సుమారు 55 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని సామర్లకోట రైల్వే పోలీసులు గుర్తించారు. రైల్వే ట్రాక్ మెన్ కొండబాబు అందించిన సమాచారంతో సామర్లకోట రైల్వే పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహంపై ఆలీవ్ గ్రీన్ రంగు ప్యాంటు, తెలుపు, కాఫీ రంగు డిజైన్ కలిగిన చొక్కా ఉన్నట్టు పోలీసులు చెప్పారు. గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. రైల్వే పోలీసు హెడ్‌కానిస్టేబుల్ జీ.శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సోమవారం రాత్రి తెలిపారు.

వాట్సాప్‌లో స్టేటస్ పెట్టి...
గోదావరిలో దూకి ఆత్మహత్య

కొవ్వూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధిని తట్టుకోలేక ఓ వ్యక్తి కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి పైనుంచి గోదావరిలో దూకి మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలంలోని నందమూరు గ్రామానికి చెందిన కోడిగుడ్ల వ్యాపారి కలివరపు చాణక్య (36) కొవ్వూరు ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చిన్నతనం నుంచి (బై పోలార్) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం ఉదయం చాణక్య తన యాక్సిస్ బండిపై ఇంటి నుంచి బయటకువచ్చాడు. రోడ్డు కం రైలు బ్రిడ్జిపైకి చేరుకుని తన మొబైల్ వాట్సాప్‌లో మానసిక వ్యాధిని తట్టుకోలేక గోదావరిలో దూకి చనిపోతున్నానని స్టేటస్ పెట్టుకున్నాడు. స్టేటస్‌ను భార్య చూసి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. చాణక్య సోదరుడు సురేష్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ విశ్వం మిస్సింగ్ కేసునమోదు చేశారు. అనంతరం సురేష్ తన భార్య వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్తూ రోడ్డు కం రైలు బ్రిడ్జిపై చాణక్య యాక్సిస్ బండిని చూసి తన అన్నయ్య శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. దీంతో గోదావరి నది లో గాలింపు చర్యలు చేపట్టగా రోడ్డు కం రైలు బ్రిడ్జి దిగువన ఎరినమ్మఘాట్‌లో చాణక్య మృతదేహాన్ని గుర్తించి కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చాణక్యకు భార్య బేబి సరోజిని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సురేష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.


చాణక్య (ఫైల్‌ఫొటో)


మృతదేహం

గుండెపోటుతో 'ఉపాధి' కూలీ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు చేస్తున్న సమయంలో మహిళకు గుండెపోటు రావడంతో అక్కడిక్కడే మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన జక్కంశెట్టి విశాలాక్షి (73) ఉపాధి పనులు చేస్తుంది. సోమవారం ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్ప కూలిపోగా పక్కన ఉన్న కూలీలు సపర్యలు చేశారు. అప్పటికే ఆమె మృతిచెందడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకునివెళ్లారు. మృతదేహానికి ఏపీవో అడపా వెంకట శ్రీకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ మనోహర్ ఫీల్డ్‌అసిస్టెంట్ గంగాధర్ నివాళులర్పించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

అంబాజీపేట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రోడ్డుపక్కనే జీవిస్తూ అక్కడక్కడే తిరుగుతున్న మతిస్థిమితం లేని మహిళ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద సోమవారం తెల్లవారుజామున ఆ మహిళను గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొంది. దీంతో ఆమె విగతజీవిగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి కేసు నమోదు చేశారు. ఈ మహిళ వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కె.చిరంజీవి కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించామని చెప్పారు.


చినలంక వద్ద మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పురుగుల మాంసం విక్రయించినందుకు
సామర్లకోటలో చికెన్ దుకాణం సీజ్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



కోడిమాంసం విక్రయించిన చికెన్ దుకాణం

సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పురుగులతో కూడిన నిల్వ ఉన్న కోడిమాంసం విక్రయించిన కాకినాడ జిల్లాలోని సామర్లకోట సంతమార్కెట్ వద్ద ఉన్న సూపర్ చికెన్ సెంటర్ దుకాణాన్ని మూసివేయాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ఆదేశించారు. ఆదివారం పురుగులతో ఉన్న కోడిమాంసాన్ని విక్రయించినట్టు కొనుగోలుదారులు చేసిన ఫిర్యాదుల మేరకు ఆంధ్రజ్యోతిలో వాస్తవ కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సామర్లకోట మున్సిపల్ అధికారులను ఆరా తీయడమే కాకుండా సత్వరం చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో నేరుగా కోడిమాంసం విక్రయించిన సంత మార్కెట్ రామాలయం పక్కనే ఉన్న సూపర్ చికెన్ సెంటర్‌కు మున్సిపల్ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య తనిఖీలు నిర్వహించారు. చికెన్ విక్రయాల వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని, హైజెనిక్ పద్ధతులు పాటించకపోవడాన్ని కమిషనర్ గుర్తించారు. డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ పరిశీలించారు. రోజుకు ఎంత పరిమాణంలో కోడిమాంసం, మేకమాంసం విక్రయాలు సాగిస్తారో తెలుసుకున్నారు. చికెన్ దుకాణంలో పూర్తిస్థాయి హైజెనిక్ పద్ధతులు పాటించిన తర్వాత తమ సిబ్బంది పరిశీలన చేసిన అనంతరం మాత్రమే విక్రయాలు సాగించాలని, అంతవరకూ దుకాణాన్ని మూసివేయాలని ఆమె తెలిపారు. ఆదేశాలు ఉల్లంఘించి అక్రమంగా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శానిటరీ మేస్త్రీ గూడుపు శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీ చేస్తున్న సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, సిబ్బంది

భార్య, ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్త అరెస్ట్

అమలాపురం టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భార్యతో పాటు ఆమె కుటుంబీకులపై హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తను అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించినట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. వివరాల ప్రకారం... ఈ నెల 22న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఉప్పర్ల కాలనీలో నివాసముంటున్న వేముల బాల, ఆమె కుటుంబ సభ్యులపై భర్త అయిన ప్రసాద్ విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఇంట్లో అవసరాలు పట్టించుకోకుండా బాధ్యత లేకుండా తాగి తిరుగుతున్నాడని భార్య బాల ప్రశ్నించడంతో పాటు మోటారుసైకిల్ ఈఎంఐల కోసం సొమ్ములివ్వాలని అడిగినందుకు చెక్కబద్దతో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అడ్డుపడిన అత్తమామలు, మరదలిని తీవ్రంగా గాయపరిచాడు. ఈ కేసులో వేముల ప్రసాద్‌ను దర్యాప్తు అధికారి అయిన ఎస్ఐ టి.శ్రీనివాస్ అరెస్టుచేసి హత్యాయత్నానికి ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకుని అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించినట్టు తెలిపారు.

సత్యదేవుని సన్నిధిలో నీటిని వృథా చేయొద్దు

▸ పంపా రిజర్వాయర్‌లోకి ఏలేరు నీరు చేరేలా చర్యలు

▸ పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో కాకినాడ జిల్లా కలెక్టర్ సమీక్ష

అన్నవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీరు వృథా కాకుండా చూడాలని, కనీసం రోజుకు 2లక్షల లీటర్ల నీటిని పొదుపుచేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. పోలవరం పనుల కారణంగా పంపా రిజర్వాయర్‌లో నీరు నిల్వలేకపోవడం, ప్రస్తుతం ఎండల కారణంగా ఉన్ననీరు ఆరించిపోవడంతో సత్రం గదుల్లో బస చేసే భక్తులకు నీటిసౌకర్యం కల్పించే విషయంలో ఇబ్బందులు మరోపక్క శ్రీరామనవమి, స్వామివారి దివ్యకల్యాణోత్సవాల్లో చక్రస్నానం కార్యక్రమాల నీటి అవసరాలపై సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పోలవరం, ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏలేరు నీటిని పోలవరం ప్రాజెక్ట్ పనులకు ఆటంకం కలగకుండా పైప్‌లైన్ వేసేందుకు సుమారు రూ.22లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేసి ఆ నిధులను ఇప్పించాలని కలెక్టర్‌ను కోరడంతో ఆయన అంగీకరించారు. అయితే ఏప్రిల్ 15 నుంచి ఏలేరు రిజర్వాయర్ నీటిని పంపాలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏలేరు నీరు వచ్చే కాలువవెంబడి పంటలు ఉంటే రోజుకు 25 క్యూసెక్కుల చొప్పున నెలరోజులు పంటలు లేకుంటే 50 క్యూసెక్కులు చొప్పున 15 రోజుల పాటు నీటిని అందిస్తే వేసవి నుంచి భక్తులు గట్టెక్కించవచ్చని ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు తెలపడంతో ఆవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీటినిల్వలు భక్తుల అవసరాలకు పొదుపుగా వాడుకుంటే నెలరోజులకు సరిపోతాయని ఇరిగేషన్ ఈఈ తెలిపారు. సమావేశంలో దేవస్థానం ఈవో సుబ్బారావు, ఈఈ నూకరత్నం, డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరికి 11నెలలు జైలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బైక్‌ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు 11నెలల జైలు శిక్ష విధిస్తూ ఐదో అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి తీర్పునిచ్చారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సారంగధర మెట్టకు చెందిన కోసూరి వెంకటరమణ, సుబ్బారావు నగర్‌కు చెందిన ఎంపల్లి లక్ష్మణరావు 2024లో రాజమహేంద్రవరంలో దహించు అగ్ని ప్రార్థనా మందిరం వద్ద బైక్‌లను దొంగించారని బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి త్రీటౌన్ ఎస్ఐ కె.రామకృష్ణ కేసు నమోదు చేశారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి తుది తీర్పును వెల్లడించారు. ప్రాసెక్యూషన్ తరఫున అసిస్టెంట్ ఏపీపీ బీవీ మోహనరావు వాదించారు. ఈ కేసులో ట్రైల్ ప్రాసెస్‌కి ఎప్పటికప్పుడు మోనిటర్ చేసిన ప్రస్తుత త్రీటౌన్ సీఐ వి.అప్పారావును, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఎన్.వెంకటేశ్వరావులను జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

మూడో రోజు మేరీమాత మహోత్సవాలు


నిర్మలగిరిలో ప్రార్థనలు చేస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో గౌరీపట్నం మేరీమాత మహోత్సవాలకు మూడో రోజు సోమవారం భక్తులు పోటెత్తారు. పుణ్యక్షేత్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు దివ్య బలిపూజలు చేశారు. ఆయన ప్రసంగిస్తూ సకాల మానవాళి సుఖ శాంతులతో జీవించాలని, అందరూ దైవచింతన కలిగి ఉండాలన్నారు. ఉదయం రెవరెండ్ ఫాదర్ దానియేలు, మేత్రాసన నూతన గురువులు మరియజోజి, బాలరాజు, సాగర్, దివ్య బలి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సువార్త కమిటీ గాబ్రియేలు సువార్త ప్రచారం నిర్వహించారు. గౌరంట్ల జ్వానేస్, బాబుజార్జి, టీ.ఇమ్మానియేలు, కే.రాయప్ప, పరిశుద్ధ జపమాల, దివ్య బలి పూజలు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్మల స్కూల్ బాల బాలి కలతో నృత్యప్రదర్శన, కే.జ్ఞానానందం సంగీ తకచేరి, ఏసుమహిమ నాటకాలు ప్రదర్శించారు. అధిక సంఖ్యలో భక్తులు మేరీ మాతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


విద్యుత్ కాంతుల్లో జీసెస్ టవర్

బీజేపీ నేతపై కర్రతో దాడి

రౌతులపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన మండల బీజేపీ నేత యాదగిరి వెంకటరమణ(శ్రీను)పై అదే గ్రామానికి చెందిన గాలి అప్పారావు దాడి చేశాడు. సోమవారం శ్రీను తన ఇంటి వద్ద నుంచి శివాలయానికి బైక్‌పై వెళ్తుండగా అప్పారావు కర్రతో దాడి చేశాడు. గతంలో రహదారికి అడ్డంగా ఇసుక, కంకర పోశావు, పక్కకు తొలగించని ప్రశ్నించినందుకు దాడి చేశాడని, అప్పారావు వల్ల తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నాడు.

ఎండ మండే.. మబ్బు హాయే..

ఎండలు మండిపోతున్నప్పుడు మబ్బు పడితే ఎంతో హాయిగా ఉంటుంది కదా.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఇదే జరిగింది. ఆ దృశ్యాలే ఇవి.





- ఫొటోగ్రాఫర్ రాజమహేంద్రవరం

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఐ నాయకుల నిరసన

పెద్దాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం (ఎంఎల్) వినోద్ మిశ్రా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో వంతాడ గ్రామ గిరిజనులు నిరసన తెలిపారు. తాము సాగుచేసుకుంటున్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, తాతారావు, రాఘవపాల్గొన్నారు.

పాడా కార్యాలయానికి పోటెత్తిన ప్రజలు

● సమస్యలు, ఇబ్బందులపై 90 అర్జీలు



పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి సమస్యలు వివరిస్తున్న స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు

పిఠాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ స్థాయిలో పిఠాపురం పట్టణంలోని మునిసిపల్ అతిథిగృహం ఆవరణలోగల పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజలు పోటెత్తారు. సోమవారం పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.చైత్రవర్షిణి స్వయంగా ప్రజల నుంచి దరఖాస్తులు, వినతులు స్వీకరించారు. ఆయా అంశాలపై వారు చెప్పే వివరాలను నమోదు చేసుకున్నారు. వివిధ వర్గాల నుంచి 90అర్జీలు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 31, మునిసిపాలిటీ 20, వ్యవసాయశాఖ 5, పింఛన్లు 11, ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు 23వచ్చాయి. ఈ అర్జీలకు సంబంధిత శాఖలకు పంపి వాటిని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని పాడా పీడీ ఏ.చైత్రవర్షిణి తెలిపారు. ఇక నుంచి ప్రతి సోమవారం పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనర్ నామా కనకారావు, తహసీల్దారు గోపాలకృష్ణ, నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గొల్లప్రోలు పట్టణంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై దృష్టి సారించాలని స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు పాడా పీడీ చైత్రవర్షిణిని కోరారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి వర్షాలు వచ్చిన సమయంలో ముంపు ఏర్పడకుండా చూడాలని, సూర్యుడు చెరువుచుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం పూర్తి చేయాలని, సులభ్ కాంప్లెక్సులు నిర్మించాలని, పట్టణ పరిధిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. పుంతరోడ్ల నిర్మాణంతోపాటు ఏలేరు, పీబీసీ కాలువగట్లను పటిష్టపరిచి, కళింగల్స్ స్లూయిజ్‌లకు మరమ్మతులు నిర్వహించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. ఏలేరు జలాలు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కలిసిన వారిలో స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా, కొమ్ము సత్యనారాయణ, కర్రి కొండలరావు, చోడపునీడి పుల్లపురాజు, పెదిరెడ్ల వెంకట్రాజు, జ్యోతుల శివ, కీర్తి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాపిడిదొడ్డి చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

● నిలుపుదల చేయాలని కలెక్టర్, ఇరిగేషన్ ఈఈలకు రైతుల ఫిర్యాదు



మట్టి తవ్వకాలను నిలిపివేయాలని కలెక్టర్‌ను కోరుతున్న రైతులు

పిఠాపురంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెం-విరవాడ గ్రామాల మధ్య గల పాపిడిదొడ్డి చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని ఎఫ్‌కేపాలెం రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్, ఏలేరు ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావులను సోమవారం కలిసి ఫిర్యాదు చేయడంతోపాటు తక్షణం తవ్వకాలు నిలిపివేయాలని కోరారు. 100 ఎకరాల విస్తీర్ణంలోఉన్న పాపిడిదొడ్డి చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండానే కొందరు ఇటుకబట్టీల యజమానులు తవ్వకాలు చేపట్టారని తెలిపారు. మట్టిని తవ్వి తరలించేందుకు వచ్చిన జేసీబీ, లారీలను తాము అడ్డుకున్నామని చెప్పారు. చెరువులో మట్టి తవ్వకాలు చేపడితే రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. తవ్వకాలు వలన సాగునీరు అందక పంటపొలాలు ఎండిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే చెరువులో జరిపిన తవ్వకాల వలన అనేక పశువులు గోతుల్లో పడి మృత్యువాత పడ్డాయని, చెరువులోకి దిగిన మనుషులు కూడా ప్రమాదాల బారిన పడ్డారని వివరించారు. అక్రమ తవ్వకాల విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లతామని తెలిపారు. న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కలెక్టర్, ఇరిగేషన్ ఈఈలను కలిసిన వారిలో రైతులు ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజా, ముమ్మడి వీరబాబు, రామిరెడ్డి శ్రీను, ముమ్మిడి తాతకొండ ఉన్నారు.

రమణక్కపేటలో ఆర్వోప్లాంటు ప్రారంభం



రమణక్కపేటలో ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న సర్పంచ్

కొత్తపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ సెజ్ పరిధిలో ఉన్న రమణక్కపేటలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన మినరల్ ఆర్వో ప్లాంటును సర్పంచ్ కాదులూరి అమ్మాజీ సోమవారం ప్రారంభించారు. 1000 లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటుచేసిన ఆర్వోప్లాంటు ద్వారా ప్రతీరోజూ 4వేల మంది గ్రామస్తులకు, 3 ఎలిమెంటరీ పాఠశాలలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్వో ప్లాంటును ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అమ్మాజీ, జనసేననాయకులు ఆలమూరి బాబి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, చెల్లూరిరాము, మురాలశెట్టి సత్తిబాబు, అరబిందో ఫార్మాఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేద్దాం

● జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): క్షయరహిత జిల్లాగా మార్చేందుకు కలిసికట్టుగా కృషిచేద్దామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌లో ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ కాకినాడ కలెక్టరేట్ నుంచి ప్రారంభమై జెడ్పీ జంక్షన్ మీదుగా జ్యోతీబాపులే విగ్రహం వరకు కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీని అంతం చేయగలం అన్న నినాదంతో ఈరోజును ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. టీబీ వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో పనిచేయడం జరుగుతోందన్నారు. క్షయవ్యాధి అన్నది అంటువ్యాధి అని, అనుమానిత లక్షణాలు ఉన్నవారు వెంటనే కళ్లి పరీక్ష చేసుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలన్నారు. రెండు వారాలకు మించిన దగ్గు, జర్వం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పి, కఫంలో రక్తపు జీరలు, రాత్రిపూట చెమట పట్టడం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, అలసటగా ఉండటం, మెడవద్ద వాపు తదితర లక్షణాలు ఉంటే టీబీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. డిసెంబరు 7న ప్రారంభించిన 100రోజుల టీబీ కార్యక్ర మంలో భాగంగా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నరసింహనాయక్, జిల్లా టీబీ కంట్రోల్ అధికారి రమేష్, డాక్టర్ ప్రభాకర్, ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దాం

పిఠాపురం: క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బి.జయరామ్ కోరారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పిఠాపురం పట్టణంలో హెల్త్ సెంటర్ వైద్యులు, సిబ్బంది సోమవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

దగ్గువస్తే అశ్రద్ధ చేయవద్దు: డాక్టర్ సౌజన్య

కొత్తపల్లి: రెండు వారాల కంటే ఎక్కువరోజులు దగ్గు వచ్చినట్లయితే అశ్రద్ధ చేయకుండా తక్షణం దగ్గర్లో ఉన్న వైద్యులను సంప్రదించాలని నాగులాపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్య అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ ర్యాలీలో సహెచ్‌వో సరోజిని, హెచ్ఎస్ అప్పారావు, హెచ్ఈ గౌరీశ్వరి, హెచ్‌వీ జ్యోతి రత్నకుమారి, ఆరోగ్యకార్యకర్తలు కాకరపల్లి గంగాధరశ్రీనివాసరావు, ఆచారి, పలువురు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్షయను నివారించవచ్చు

కరప: సూక్ష్మ క్రిమివల్ల సంక్రమించే క్షయ వ్యాధిని ఆధునిక వైద్యంతో సులభంగా నివారించవచ్చని కరప పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఏంజెలినా తెలిపారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్షయ వ్యాధి నుంచి విముక్తి పొందిన పలువురికి శాలువా కప్పి పండ్లు ఇచ్చి సత్కరించారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. యస్ వియ్ కెన్ ఎండ్ టి.బి., కమిట్, ఇన్‌వెస్ట్ డెలివర్ అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం కలిగించారు. పీహెచ్ఎన్ జీవీవీ సత్యనారాయణమ్మ, ఎంపీహెచ్ఎస్ గోపాల్‌రావు, ఫార్మాసిస్ట్ పీఎస్ మూర్తి, స్టాఫ్ నర్స్ పి.మహాలక్ష్మి, ల్యాబ్ సూపర్‌వైజర్ జి.గోవిందరాజులు, కె.డేవిడ్‌రాజు, యూడీసీ అమ్మిరాజు, జీజీహెచ్ జీఎస్ఎం స్టూడెంట్స్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం

సామర్లకోట: క్షయవ్యాధికి సరైన సమయంలో వైద్యం అందిస్తే నయం చేయగల నివారించదగిన వ్యాధని మైక్రోబాక్టీరియం వలన కలిగే క్షయవ్యాధి (టీబీ) పురాతన కాలం నుంచీ ప్రపంచాన్ని పీడిస్తున్న వ్యాధి అని మెడికవర్ ఆసుపత్రి ప్రముఖ పల్మనాలజీ వైద్యుడు భీమశంకర్ పేర్కొన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం సామర్లకోట మండలం ఏడీబీ రోడ్డులో పనసపాడు ఆసుపత్రిలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సం పురస్కరించుకుని సోమవారం సామర్లకోట మండలం వేట్లపాలెం పీహెచ్‌సీ ఆవరణలోనూ, సామర్లకోట అర్బన్ హెల్త్ సెంటర్లలోనూ వైద్యులు, సిబ్బంది వేర్వేరుగా అవగాహనా సదస్సులు, ప్రచార ర్యాలీలు ఘనంగా నిర్వహించారు. పలువురిచే ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు ప్రజలకు అందజేశారు. వైద్యులు ఎన్.పరదేశ్, పి.రమ శ్రీదుర్గ, వి.యపావని రమ్యప్రభ, వరలక్ష్మి, కార్తీక్, హెడ్‌నర్స్ వెంకటలక్ష్మి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

పి 4తో ప్రతి ఇంటికి అభివృద్ధి

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



పి 4 వార్డు సభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యం పి4తో ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతిజీవితానికి ప్రగతి చేకూరనుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. స్థానిక సంజయ్‌నగర్ రెవెన్యూ కాలనీవద్ద సోమవారం ఉదయం 4 నుంచి 13డివిజన్లు, జగన్నాధపురం చర్చిస్క్వేర్ గ్రౌండ్‌లో 14 నుంచి 26డివిజన్లు, సాయంత్రం మెక్లారిన్ గ్రౌండ్‌లో 27నుంచి 37 డివిజన్లు, కొండయ్య పాలెం స్కూల్‌లో 38నుంచి 46 డివిజన్ల వార్డు సభలు నిర్వహించారు. ముందుగా తెలుగుతల్లి గీతాన్ని ఆలపించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కుటుం బాలను ప్రగతి వైపు నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పి 4 కార్యక్రమం ద్వారా దీర్ఘకాలిక సాధికారిత, భాగస్వామ్య సంపన్నత లక్ష్యాలను నెరవేర్చే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. దీనిలో ప్రభుత్వం సమన్వయకర్తగా వ్యవహరించి, సమాజంలోని కుటుంబాలు ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా ఒక స్వయం-నిర్వహణ సామర్థ్యం కలిగిన వ్యవస్థను నిర్మించడానికి సహకరిస్తుందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడం, భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, స్పష్టమైన ఫలితాలను అందించడం లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పేదరిక రహిత సమాజం సాధించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్, వైద్యసేవ, దీపం వంటి ప్రభుత్వ పథకాలతోపాటు సమాజంలోని సంపన్న వర్గాలు, ప్రవాస ఆంధ్రుల సహాయ సహకారాలతో అట్టడుగున ఉన్న కుటుంబాలు పేదరికాన్ని అధిగమించ డానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు.

మార్కెట్ ఆశీలు వేలంలో అధిక ఆదాయం

గొల్లప్రోలు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ జనరల్ డైలీ మార్కెట్, రోడ్డు మార్జిన్లల్లో ఆశీలు వసూలు చేసుకునే హక్కుకు సోమవారం సాయంత్రం నగరపంచాయతీ కార్యాలయంలో టెండర్ కమ్ వేలం నిర్వహించారు. నగరపంచాయతీ కమిషనరు నామా కనకారావు వేలం, టెండర్ ప్రక్రియ నిర్వహించారు. ఆరుగురు ఇందులో పాల్గొనగా వై.సత్యనారాయణ రూ.5.73లక్షలకు టెండర్ వేశారు. గత ఆర్థిక సంవత్సరంలో వేలం ద్వారా రూ.3.03లక్షలు మాత్రమే లభించింది. ఇది గతంతో పోల్చుకుంటే రూ.2.70లక్షలు అధికం. నగరపంచాయతీ కౌన్సిల్ ఆమోదంతో వేలం ఖరారు చేస్తామని కమిషనరు తెలిపారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తూరు మదీనా మశీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనారిటీల ఆర్థిక తోడ్పాటుకు టీడీపీ ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. మశీదుల నిర్మాణానికి నిధుల కేటాయింపు, మౌజన్, ఇమామ్లకు గౌరవ వేతనం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మశీద్ కమిటీ అధ్యక్షుడు షరీఫ్ కుతుబ్దిన్, అబ్దుల్ రహమాన్‌ఖాన్, మైనారిటీ నాయకులు జహరుద్దీన్ జిలాని, ఎంఏ తాజుద్దీన్, ఎస్కె అహ్మద్, ఎస్కె రహీం, ఎండీ ఖాన్, గౌస్ మొహిద్దీన్, ఎంఏ బేగ్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూడబ్ల్యుఏ కార్యవర్గం ఎంపిక

తాళ్లరేవు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గంను 17పంచాయతీల దళితుల సమక్షంలో ఎంపిక చేసినట్లు సోమవారం సంఘ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా కన్నీడి వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా కోరుకొండ లోవరాజు, కమిడి ఈశ్వరీబాయి, ప్రధానకార్యదర్శిగా కుసుమ శ్రీనివాస్, సహయకార్యదర్శిగా నేతల నాగార్జున, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెయ్యల తాతారావు, కోశాధికారిగా విప్పర్తి శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సభ్యులు తెలిపారు.

కొమరగిరి లేఅవుట్లో మిగిలిన స్థలాలు మత్స్యకారులకే

● మాజీ ఎమ్మెల్యే వర్మ

కొత్తపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి):కొమరగిరిలో లేఅవుట్లో మిగిలిన ఇళ్ళ స్థలాలను ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకే ఇస్తామని ఉప్పాడలో నిర్వహించిన ఎన్నికల సభలో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్‌వర్మ తెలిపారు. ఉప్పాడ తీరప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఉప్పాడ,మూలపేట, అమీనబాద్ మత్స్యకారులందరికీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కొమరగిరి లేఅవుట్లో మిగిలిన ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు చర్యలు చేపడతారని మత్స్యకారులు ఈ విషయంలో ఎంత మాత్రం బెంగపెట్టుకోవాల్సిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్యేవర్మ మత్స్యకారులకు మాట ఇచ్చారు. అనిశెట్టి సత్యానందరెడ్డి, కరారి రాజబాబు, మాజీ జెడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, గోర్స‌సర్పంచ్ రొంగల వీరబాబు, మాజీ ఎంపీటీసీ సన్నిబాబు, పలుఎవురు టీడీపీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'కొమరగిరి లేఅవుట్లో ఖాళీలు లేవు'

కొమరగిరి లేఅవుట్లో ఎటువంటి ఇళ్ళ స్థలాల ఖాళీలు లేవని కొత్తపల్లి తహసీల్దార్ జి.చిన్నారావు సోమవారం విగడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆనందనగరంలో నవరత్నాలు పేదలందరికీ స్థలాలు మంజూరు చేసేందుకు గతంలో చేసిన భూసేకరణలో 71 ఎకరాల భూమిని లేఅవుట్ చేసి పట్టాలు ఇచ్చేందుకు కాకినాడ అర్బన్‌కే అప్పగించామన్నారు. దాంట్లో అర్బన్‌కు చెందిన లబ్ధిదారులకు కేటాయించారన్నారు. ప్రస్తుతం కొమరగిరి లేఅవుట్లో ఎటువంటి ఖాళీలు లేవని ఆయన పేర్కొన్నారు.

పెదబ్రహ్మదేవం సమస్యలపై జనసేన వినతులు

సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో గత ఐదేళ్లుగా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామ జనసేన నాయకులు మలకల వెంకటేశ్వరరావు పలువురు అధికారులకు సోమవారం ఫిర్యాదులు చేశారు. వినతులు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీహరికి అందజేశారు. ఈ మేరకు వినతులను సోమవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, ఎంపీడీవో హిమమహేశ్వరి, తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి, సామర్లకోట రైల్వే సూపరింటెండెంట్ రమేష్ తదితర అధికారులకు అందజేసినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

'నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సామర్లకోట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో రిజిష్టర్ డాక్యుమెంట్లు ఉన్న స్థలాలకు సైతం నకిలీ పట్టాలు పుట్టిస్తూ హౌసింగ్ అధికారులను తప్పుదోవపట్టిస్తూ కొందరు వ్యక్తులు అక్రమాలకు పాల్పడుతున్నందున సత్వరం దర్యాప్తు జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకులు కాళ్ళ రవీంద్రబాబు సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు.

స్వయం సహాయక సంఘాలకు 25 ఎలక్ట్రికల్ బైకులు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ స్వయం సహాయక సంఘ సభ్యులు వారి కుటుంబసభ్యుల జీవనోపాధి మెరుగుకోసం మెప్మా ద్వారా రాపిడో భాగస్వామ్యంతో 25 ఎలక్ట్రికల్ బైకులను వివిధ బ్యాంకుల ద్వారా రుణసదుపాయంతో సోమవారం సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, టీడీపీ సిటీ ప్రెసిడెంట్ మల్లిపూడి వీరు, మెప్మాప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద, సిటీమిషన్ మేనేజర్ డి.వెంకట్రాజు, వివిధ బ్యాంక్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎలక్ట్రికల్ బైక్‌లతో స్వయం సహాయక సంఘ సభ్యులు

కరప ఏఎంసీ చైర్మన్‌గా రమేష్ నియామకం



రమేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కరప వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్ నియమితులయ్యారు. కరప గ్రామానికి చెందిన ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. జనసేనపార్టీ ఆవిర్భావం నుంచి రమేష్ క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. అతని సేవలకు గుర్తింపుగా కీలక పదవి ఇవ్వాలని ఎమ్మెల్యే పంతం నానాజీ భావించారు. మండలంలోని పలువురు జనసేన నాయకులు ఈ పదవి కోసం పోటీపడ్డారు. చివరకు పార్టీ అధిష్టానంలోని కీలక నేత ఆశీస్సులతో గణేష్‌నాయుడు, రమేష్‌లు బరిలో నిలిచారు. ఇరువురి మధ్య నాయకులు సయోధ్య కుదిర్చే ప్రయత్నాలు ఫలించకపోవడంతో లాటరీ తీయాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే నానాజీ సమక్షంలో పలువురు నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి లాటరీ తీసి చైర్మన్‌గా రమేష్ పేరును ఖరారు చేశారు. రెండేళ్ల తరువాత ఈ పదవిని గణేష్‌నాయుడికి ఇస్తానని ఎమ్మెల్యే అతనికి మాట ఇచ్చినట్టు తెలిసింది. కాగా చైర్మన్‌గా ఎన్నికైన రమేష్‌ను ఎమ్మెల్యే నానాజీ, పార్టీ నాయకులు, గ్రామస్థులు అభినందించారు.

గ్రంథాలయ కార్యదర్శి శంకరరావుకు ఉగాది పురస్కారం

● పుస్తకాలు బహూకరించిన సరస భారతి సాహితీ సంస్థ



కొండేపూడి శంకరరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, సంస్థ ప్రతినిధులు

పిఠాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ప్రధాన కార్యదర్శి కొండేపూడి శంకరరావుకు కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సరసభారతి సాహితీ సంస్థ ఉగాది పురస్కారం ప్రకటించింది. గ్రంథాలయం ద్వారా అందిస్తున్న సేవలకు ఈ పురస్కారం ప్రకటించారు. శంకరరావును ఉయ్యూరులో జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కారంతో సత్కరించి గ్రంథాలయానికి సరసభారతి సాహితీ సంస్థ రచనలు, ఇతర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వైబీ రాజేంద్రప్రసాద్, సరసభారతి సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్, రాష్ట్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక రమేష్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాహితీవేత్తలు పాల్గొన్నారు.

నాగు మాస్టారు నేత్రాల దానం

తాళ్లరేవు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ధూళిపూడి సీతాసత్య నాగేశ్వరరావు(నాగుమాస్టారు) సోమవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌కు రెండు నేత్రాలను దానం చేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది నేత్రాలను సేకరించారు. దానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

తాళ్లరేవులో ఉల్లాస్ పరీక్షలు

తాళ్లరేవు ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏపీఎమ్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో 750మంది అభ్యాసకులుకు 23 పరీక్ష కేంద్రాల్లో సోమవారం పరీక్షలు నిర్వహించారు. సీడీపీవో మాధవి సహకారంతో 738ఉల్లాస్ అభ్యాసకులు హాజరై పరీక్షలు రాశారు.

జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభం



జిల్లా బీజేపీ కార్యాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం సోమవారం రామారావుపేట పొట్టిశ్రీరాములు కూడలిలో జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోదావరిజిల్లాల జోనల్ ఇన్‌చార్జి సాగి కాశీవిశ్వనాధ రాజు ప్రారంభోత్సవం చేశారు. పూజా కార్యక్రమాలు, శ్రీసత్యనారాయణస్వామివ్రతం నిర్వహించారు. పార్టీ నాయకులు పైడా కృష్ణమోహన్, మాలకొండయ్య, పైడా భావనప్రసాద్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

యోగా ట్రైనర్ సత్యప్రియకు గౌరవ డాక్టరేట్



పిఠాపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణానికి చెందిన యోగా ట్రైనర్ వనం సత్యప్రియకు గౌరవ డాక్టరేట్ లభించింది. రెండు దశాబ్దాలుగా చిన్నారులకు యోగాలో శిక్షణఇస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించేలా సత్యప్రియ చేస్తున్న కృషికిగానూ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను ప్రకటించారు. పాండిచ్చేరిలోని షాన్‌బాగ్ కన్వెన్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, జర్మనీలోని గ్లోబల్ ఎక్రిడేషన్ కౌన్సిల్ సభ్యుడు జార్జి ఫ్రెండ్ పీటర్, నేషనల్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం.కాదిర్వేల్, ఆర్గనైజర్ డాక్టర్ కిమ్ చీఫ్, డాక్టర్ ఏ.గోపికన్నన్ ద్వారా సత్యప్రియ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు రవికి ముహూర్త శిరోమణి పురస్కారం



విశ్రాంత ఉపాధ్యాయుడు అనిశెట్టి రవిని ముహూర్త శిరోమణి పురస్కారంతో సత్కరిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు అనిశెట్టి రవీంద్ర సత్యప్రసాద్(రవి)కి వైదిక సమ్మేళనంలో ముహూర్త శిరోమణి పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని విశ్వజ్యోతి జ్యోతిష్య విజ్ఞాన సంస్థ విజయవాడలో నిర్వహించిన వైదిక సమ్మేళనంలో ఉగాది పురస్కారాల్లో భాగంగా జ్యోతిష్యం, వాస్తుశాస్త్రాల్లో ఉచిత సేవలు అందిస్తున్న రవికి ఈ అవార్డును ప్రకటించారు. ఈ సమ్మేళనంలో రవికి బహుగ్రంథ రచయిత పుచ్చా శ్రీనివాసరావు, పాలపర్తి శ్రీనివాసశర్మ, ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాసరావులు ముహూర్త శిరోమణి పురస్కారంతో సత్కరించి అవార్డును అందజేశారు.


ధాన్యం కొనుగోలులో పారదర్శకత పాటించాలి

కరప, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం కొనుగోలు పక్రియలో సిబ్బంది పారదర్శకత పాటించాలని తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఏవో అప్పసాని వెంకటరాజేష్‌లు సూచించారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో సోమవారం వీఆర్‌వోలు, వీపీఏలు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఏర్పాటుచేసిన శిక్షణాకార్యక్రమంలో వారు మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సాంకేతిక అంశాలను డిస్ట్రిక్ట్ రీసోర్స్‌పర్సన్ దుర్గాప్రసాద్ వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు ప్రశాంత్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

27న పి.వేమవరం ఉపసర్పంచ్ ఎన్నిక

సామర్లకోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పదవి ఖాళీ భర్తీ చేసేందుకు ఈనెల 27న పంచాయతీ ఆవరణలో పంచాయతీ సభ్యుల సమక్షంలో ఎన్నిక జరుగనున్నట్లు సామర్లకోట మండల ఈవోపీఆర్డీ భైరవమూర్తి సోమవారం విలే కరులకు తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ పదవికి గతంలో రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27న ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నందున పంచాయతీ సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని ఈవోపీఆర్డీ భైరవమూర్తి తెలిపారు.

పీఆర్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్ ఎన్నిక



కరప, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కరపమండలం పెనుగుదురు గ్రామానికి చెందిన రెడ్డిపల్లి వీరవెంకటరమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావుకు ఎంపీడీవోగా పదోన్నతి లభించడంతో ఆయన స్థానంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న రమేష్‌ను ఎన్నుకున్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన సంఘ సమావేశంలో రమేష్ అభ్యర్థిత్వాన్ని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు బలపరిచారు. రమేష్‌ను మాజీమంత్రి కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మీసత్తిబాబు, బండారు సతీష్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో క్వారీ యూనియన్ కార్మికులు సోమవారం యూనియన్ కార్యదర్శి కుప్పుల నాగభూషణం నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. కార్మికుల అగ్రిమెంటుపై యాజమాన్యం స్పందించడం లేదన్నారు. రెండు, మూడు రోజుల్లో సరైన నిర్ణయం తీసుకోవాలని లేకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధితుడికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి సోమవారం బాధితులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 22 మందికి రూ.19.30లక్షలు బాధితులకు అందించామన్నారు. ఎమ్మెల్యే గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు 30 మందికి రూ.30 లక్షలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్, టీడీపీ నాయకులు పాము అర్జున్, పల్లాల వెంకటరమణారెడ్డి, కారం సురేష్‌బాబు, ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 65 అర్జీలు

రంపచోడవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు 65 అర్జీలు అందాయని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఆయన సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, ఏపీవో(జీ) డీఎన్వీ రమణతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ అందిన అర్జీలు నిర్ణీత గడువులోగా పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని, కొండపోడు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం.రుక్మాండయ్య, షరీఫ్, ఏడీఎంహెచ్‌వో శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అడ్డతీగలలో మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు

సమాజం నుంచి క్షయవ్యాధిని తరిమేద్దాం

అడ్డతీగల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి టిబి యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం, ర్యాలితో పాటు, దేవీ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ అధికారి డాక్టర్ పండా సతీష్ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో వైద్యులు నాగ ప్రత్యుష, ప్రసన్న దేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఆయన సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీతో కలిసి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో టీబీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏరియా ఆసుపత్రి ఆర్ఎం పి.వెంకట ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి(ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీ పరిధిలో సోమవారం జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవం డాక్టర్ సుష్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పద్మావతి, హెచ్ఎస్ సుధాకర్, హెచ్‌విలు లక్ష్మమ్మ, రత్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ కూటమి నాయకులు

నూతనంగా ఆదివాసీ సంఘాల కూటమి ఏర్పాటు

అడ్డతీగల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసులే పాలనే లక్ష్యంగా ఆదివాసీ సంఘాల కూటమి (ఎయస్‌కె) ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని ఆదివాసీ కూటమి నాయకులు తెలిపారు. రంపచోడవరం నియోజక వర్గం పరిధిలో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాల వల్ల పెను ప్రమాదం పొంచి ఉన్నందున ఆదివాసీల భవిష్యత్, మనుగడ పరిరక్షణ కొరకు ఆదివాసీ సంఘాల కూటమి ఏర్పాటు చేయవలసి వచ్చిందని సంఘ నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వెదుళ్ళ లచ్చిరెడ్డి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు తీగల బాబురావు, రంపచోడవరం, అడ్డతీగల ఆదివాసీ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు మేడిద నూకరాజు తదితర సంఘ నాయకులు ముఖ్య కార్యకర్తలు తదితరులు పాలొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చట్టవ్యతిరేక పనులకు దూరంగా ఉండాలి

వై.రామవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని ఉద్యోగ, ఉపాధి అవకాశాల వైపు మొగ్గు చూపాలని అడ్డతీగల సీఐ నరసింహమూర్తి సూచించారు. సోమవారం వై.రామవరం వారపు సంతలో ఎస్ఐ రామకృష్ణతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి అక్రమ రవాణ, నాటుసారా విక్రయాలు, సైబర్ నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు పాటించాలని, వాహనాల డ్రైవింగ్ లైసెన్సులు, నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్ఐలు సురేష్, చక్రదొర, మహతి, చందన, గౌరేశ్వరి, లోకేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

గండిపోశమ్మ తల్లి ఉత్సవ ఫ్లెక్సీ ఆవిష్కరణ

దేవీపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి వార్షిక జాతర ఉత్సవాల ఫ్లెక్సీని సోమవారం రంపచోడవరం ఎమ్మెల్యే ఎం.శిరీషదేవి, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు విజయభాస్కర్ ఆవిష్కరించారు. అలాగే సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, ఐటీడీఏ పీవో కె.సింహాచలం జాతర ఫ్లెక్సీని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు ఎం.బుజ్జి, టీడీపీ నాయకులు మాగాపు బాబురావు, గొందూరు గ్రామస్తులు తెల్లం సింగరాజు, మేడే బాపన్నదొర, మడకం చిరంజీవి, అంజిబాబు, ఆలయ సిబ్బంది ఎస్.వెంకన్నదొర పాల్గొన్నారు

గద్దెలమ్మతల్లి అమ్మవారి గరగల సంబరం

దేవీపట్నం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.రావిలంక గ్రామంలో శ్రీ గద్దెలమ్మతల్లి అమ్మవారి గరగల సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి 7గంటల నుంచి మంగళవారం ఉదయం 10గంటల వరకు ఈసంబరం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

క్షయ నివారణకు చర్యలు తీసుకోవాలి

అవగాహన ర్యాలీలు నిర్వహించిన వైద్యులు, సిబ్బంది


ప్రత్తిపాడు ఆసుపత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


జగ్గంపేట రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని దీని నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ప్రత్తిపాడులో క్షయ నివారణ దినోత్సవం ర్యాలీని సోమవారం నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వైద్య సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేట రూరల్: జగ్గంపేటలో వైద్యులు డాక్టర్ వై.శ్రీరాం, ఎన్.పూజ సిబ్బందితో కలిసి రాజపూడి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారు వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయ ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందే అవకాశంఉందన్నారు. వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం,రూ.1000ను ప్రభుత్వం ఇస్తుందన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ప్రాథమిక ఆరోగ్య శాఖాధికారి హేమాంజలి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధిని ముందుగా గుర్తిస్తే వాటిని నిర్మూలించేందుకు మందులు ఉన్నాయన్నారు. ఫార్మసిస్టు గంగాధర్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

శంఖవరం: టీబీపై ప్రతీ ఒక్కరూ అవగాహనతో ఉండి మహమ్మారిని తరిమికొట్టాలని డాక్టర్ శ్రీరామ్ రాజీవ్‌కుమార్ అన్నారు. శంఖవరం ప్రభుత్వాసుపత్రి, సీతంపేట రిఫరల్ ఆసుపత్రి వద్ద క్షయపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిఫరల్ చైర్మెన్ ప్లెస్సర్‌బాబు, ఆర్ ప్రవీణ, ప్రసాద్‌కుమార్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


భూపాలపట్నం-వీరవరం రోడ్డు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఉమాశంకర్

కిర్లంపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం నుంచి వీరవరం వెళ్లే రోడ్డు పనులు నత్తనడకన సాగడం, నాణ్యత లోపంతో నిర్మిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో ఇటీవల కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీంతో స్పందించిన అధికారులు ఈ రోడ్డు పనులను వేగవంతం చేశారు. ఈ పనులను సోమవారం జగ్గంపేట పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఉమాశంకర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా చేపడతామని తెలిపారు.

'మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలి'

ప్రత్తిపాడు/ఏలేశ్వరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన జై భీమ్ రావ్ భారత పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడిశెట్టి వీరబాబు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కలెక్టర్‌లోని జేసీ రాహుల్‌మీనాకు, ఎక్సైజ్ సూపరింటిండెంట్ కృష్ణకుమారికి వినతి అందజేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో 210 ఉల్లంఘిస్తూ జిల్లాలో పలు చోట్ల మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని జేసీకి ఫిర్యాదు చేశారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జేసీకి విద్యార్థి సంఘంవినతి పత్రం అందజేసింది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు,జిల్లా నాయకుడు మణికంఠ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


హోమ క్రతువులో పాల్గొన్న యనమల రాజేష్

తుని రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్.సూరారం గ్రామంలోని కల్యాణ లక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమ క్రతువులను పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీడీపీ యువ నాయకుడు యనమల రాజేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి)దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను భక్తులు స్వీకరించారు. పలువురు ప్రముఖులు స్వామి,అమ్మవార్లను దర్శించారు.

అరుణాచలేశ్వరునికి విశేష పూజలు

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లిలో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వరునికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. రమణ సేవాశ్రమ నిర్వాహకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు పంచామృత అభిషేకాలు, పంచ హారతులు ఇచ్చారు. అపీత కుచాంబఅమ్మవారికికుంకుమార్చనలు, లలిత సహస్ర పారాయణాలు నిర్వహించారు. ఏలేశ్వరానికి చెందిన కర్రి రాంబాబు, మహాలక్ష్మి కుమారుడు జయరామ్, కుమార్తెలు సాయి సత్యశ్రీలు ఆలయంలో అన్నదానం చేశారు.

'పీ4 సర్వేతో ప్రతి ఇంటికి ప్రయోజనం'


తొండంగిలో జరిగిన గ్రామ సభ దృశ్యం

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పీ4 సర్వేతో ప్రతి ఇంటికి ప్రయోజనం చేకూరనున్నదని ప్రత్తిపాడు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు చెప్పారు. చినశంకర్లపూడి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సర్పంచ్ ఏపూరి రామారావు అధ్యక్షతన పీ4 సర్వే గ్రామసభ నిర్వహించారు. సర్వే ఆవశ్యకతను ఎంపీడీవో వివరించారు. ఈ వోపీఆర్డీ కాశీ విశ్వనాథ్, కార్యదర్శి బర్రే వీరబాబు, సచివాలయ సిబ్బంది కస్తూరి తేజ ప్రసాద్ ఉన్నారు.

తొండంగి: మండలంలో జరిగిన పీ4 సర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 27 488 కుటుంబాలను పీ4 సర్వేలో గుర్తించారు. ప్రతి గ్రామానికి సంబంధించి దిగువన ఉన్న 20 శాతం కుటుంబాలకు చెందిన డేటాను సభల్లో ప్రవేశ పెట్టారు. దీనికి సంబంధించి అభ్యంతరాలు, సలహాలు సూచనలు స్వీకరించారు. కుటుంబ సంపాదనాపరులు, బ్యాంకు అకౌంట్, విద్యుత్ కనక్షన్, తాగునీటి వనరు, గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన అభ్యంతరాలను స్వీకరించారు. అన్ని గ్రామాల నుంచి వచ్చిన డేటాను క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎంపీడీవో రాజేశ్వరరావు తెలిపారు. తొండంగి సభలో సర్పంచ్ సోమాల ప్రసాద్, కార్యదర్శి పరమానందరావు ఉన్నారు.

తునిరూరల్: పి 4గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సాయి నవీన్ కోరారు. మండలంలో 23 గ్రామ పంచాయతీల పరిధిలో సభలు నిర్వహించారు. ఈ సర్వేలో మార్పు చేర్పులు ఏమైనా ఉంటే గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు.

గండేపల్లి: జడ్.రాగంపేట పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కందుల చిట్టిబాబు అధ్యక్షతన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ చిట్టిబాబు మాట్లాడుతూ పీ4 సర్వేపై గ్రామసభ గ్రామంలో పేదరిక నిర్మూలన అరికట్టాలని ఉద్దేశ్యంతో సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. కందుల బాబ్జి, ఉండవల్లి వరప్రసాద్, కార్యదర్శి తరంగణి, స్పెషల్ అబ్జర్వర్ ఎంఈవో 2 వెంకటరెడ్డి, డీఆర్పీ పి.బాబురావు,ఏపీవో గంగాభవానీ పాల్గొన్నారు.

జగ్గంపేటలో గ్రామసభ

జగ్గంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బచ్చల నాగరత్నం అధ్యక్షతన గ్రామసభను పంచాయతీ సెక్రటరీ శివ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది గ్రామీణాభివృద్ధికి పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఉగాది సందర్భంగా పారిశధ్య కార్మికులకు నూతన వస్త్రాలు, రూ.500 నగదు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, బచ్చల సుధీర్, చెలికాని హరిగోపాల్, డేగల సత్తిబాబు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

'ప్రజలకు ఆసరాగా నిలిచే మంచి ప్రభుత్వం'


శంఖవరం: చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

శంఖవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజలకు ఆసరాగా నిలిచే మంచి ప్రభుత్వం తమదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. సోమవారం నెల్లిపూడి సాయి, ములగలపల్లి లోవలక్ష్మిలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను అందించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడిన తమకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెలుగుయువత అధ్యక్షుడు కీర్తి వెంకటసుభాష్, బద్ది రమణ, పోలం చిన్నా, కర్రి శివాజీ తదితరులు ఉన్నారు.

ప్రత్తిపాడు: వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న నియోజకవర్గానికి చెందిన 28 మంది బాధితులకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రూ.30లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన ఎరికి రెడ్డి శ్రీను, చీకట్ల చిన్నారావులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పబాబు, బొల్లు దివాణం, ముప్పన బోయిన యేసు బాబు పాల్గొన్నారు.

రాజుపాలెం-రామవరం రోడ్డు పనులు పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న తుమ్మలపల్లి రమేష్

కిర్లంపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం నుంచి రామవరం వెళ్లే ప్రధాన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆర్అండ్‌బీ అధికారులు ఏఈ, డీఈలను కోరారు. పనులను అధికారులు, కూటమి నాయకులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంపై ఆయా గ్రామస్తులు ఈ విషయాన్ని రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. రాళ్లు పైకి లేచిపోయి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణశేఖర్, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, జడ్పీటీసీ తోట గాంధీ, తామరాడ మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్, కాయల మణికంఠ, పాలెం బాబీ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి : డీఎల్‌పీవో

కిర్లంపూడి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలని పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి అన్నారు. సోమవారం ఆమె మండలంలోని వేలంక గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, ఇంటి పన్నులు వసూళ్లపై పరిశీలించారు. వేలంక గ్రామంలో ఇంటి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శి పెద్దకాపును ఆదేశించారు.

పేదలకు అన్నదానం

జగ్గంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద మూడేళ్లుగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. సోమవారం ఈ క్యాంటీన్‌లో మీసాల వెంకట్రావు, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు మీసాల రాఘవేంద్రరావు, మీసాత సత్యనారాయణ ఆర్థిక సాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం హాజరై పేదలకు వడ్డించారు.

26 నుంచి పోలవరం గ్రామసభలు

కూనవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి మొదటి ఫేజ్‌లో ఉన్న గ్రామాలకు పోలవరం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ తెలిపారు. కూనవరంలో పర్యటించి ఆయన అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కోండ్రాజుపేట, వాల్పూర్‌పేట, కూళ్లపాడు, పండ్రాజుపల్లి గ్రామాల్లో మొదటి విడతగా ఈసభ నిర్వహిస్తారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వివరాలు, భూమికి భూమి, ఆర్అండ్ఆర్ కాలనీలకు భూమి వంటి సమావేశంపై ఈ సభ జరుగుతుంది. ఈ గ్రామసభలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి అర్హులు, అనర్హుల వివరాలు వెల్లడిస్తారు. సదరు ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఇదే గ్రామసభలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి తప్పనిసరిగా నిర్వాసితులు ఈగ్రామసభలో పాల్గొనాలన్నారు.

మావోయిస్టులపై వ్యతిరేక ర్యాలీ

వై.రామవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సోమవారం వై.రామవరం వారపు సంతలో ప్రజలు మావోయిస్టులకు వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని బస్సుల దహనం చేసి రవాణా లేకుండా చేస్తున్నా ఆగ్రహిస్తూ నినాదాలు చేశారు.

'తక్షణం బీసీ కులగణన చేయాలి'


మాట్లాడుతున్న వెంగళరావుయాదవ్

జగ్గంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తక్షణమే బీసీ కులగణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. జగ్గంపేటలో సోమవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరావుయాదవ్ హాజరయ్యారు. బీసీలకు ప్రత్యేకంగా అట్రాసిటీ చట్టాన్ని ప్రవేశపెట్టాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ సాధికారత కోసం బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో బీసీ మండల్ పేరుతో బీసీ భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వియ్యపు అప్పలస్వామి, పంచికట్ల రామకృష్ణ, వై.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి'

శంఖవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉంటాయని నివేదికలు చెప్తున్నాయని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. సోమవారం ఆయన అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. 2024-25 బడ్జెట్‌ను ఆమోదించడంతో పాటు 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించి వేసవిలో విద్యుత్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ సిబ్బందిని కోరారు. ఎంపీడీవో ఎస్ఎస్ శర్మ, తహశీల్దారు తాతారావు, వైస్ ఎంపీపీలు రమణ, ఈగల చిన్నమ్ములు తదితరులున్నారు.

'పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత'

కిర్లంపూడి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా విద్యార్థులు భావించి ప్రతీ విద్యార్థి తమ కుటుంబసభ్యులను చైతన్యపరచాలని సామాజిక ఉద్యమకారుడు పాటంశెట్టి సూర్యచంద్ర విద్యార్థులను కోరారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఆయన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ఇంటి వద్దనే పంచాయతీ సిబ్బందికి అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ పరిసరాల కోసం కృషి చేసే విద్యార్థులను గుర్తించి వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు.

'ఆదిత్య' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పులిమేరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ కె.రవిశంకర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా గ్రామసర్పంచ్ తుమ్మల సురేఖ విచ్చేసి ప్రారంభించారు. 200మందికి వైద్య సేవలు అందించి మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ప్రశాంతి, ఎస్.శృతి, బి.రేణుక, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వర్క్‌షాప్

ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్‌పై 2రోజుల వర్క్‌షాప్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం సోమవారం ప్రారంభించారు. బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. హైడ్రో ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో తరుణ్ కె కరణం ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రమేష్ తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వాకదారి పేట కేజీబీవీలో 6 వతరగతి, మొదటి ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రత్యేకాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. ఆరవ తరగతిలో 40, మొదటి ఇంటర్‌లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రియల్ 11 లోపు పూర్తి చేసిన దరఖాస్తులను తమ వెబ్ సైట్ ద్వారా కార్యాలయానికి పంపాలన్నారు.

బాధితులకు ఆర్థికసాయం

ప్రత్తిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో పోతులూరుకు చెందిన గుర్రా భీమరాజు భవన నిర్మాణ పనులు చేస్తూ గాయపడ్డాడు. బొండ్రు రబిక అనే పేద మహిళ అనారోగ్యానికి గురవడంతో వారిని సోమవారం ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, నాయకులు ఎలుబంటి బాబ్జి, డి.నాగేశ్వరరావు, కోలా తాతబాబు ఉన్నారు.